శనివారం
11-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 140
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇస్రో శాస్త్రవేత్త దాతృత్వం

చెన్నై: దేశ ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిన చంద్రయాన్-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వీరముత్తువేల్ తన దాతృత్వ గుణాన్ని చాటి ఆదర్శంగా నిలిచారు. తాను అందుకున్న నగదు బహుమతిని పూర్వ విద్యార్థుల సంఘాలకు విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంలో ఇస్రో ప్రధాన శాస్త్రవేత్తలు ఎనిమిది మందిని తమిళనాడు ప్రభుత్వం సత్కరించింది. ఒక్కొక్కరికీ రూ. 25 లక్షలు నగదు బహుమతి అందజేసింది. ఆ మొత్తాన్ని తాను చదువుకున్న విల్లుపురంలోని ఎలుమలై పాలిటెక్నిక్ కళాశాల, తిరుచ్చిలోని శ్రీసాయిరామ్ ఇంజనీరింగ్ కళాశాల, ఐఐటీ మద్రాసు పూర్వ విద్యార్థుల సంఘాలకు సమానంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

మేం చెబితేనే కదులుతారా?

దిల్లీ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో నెలకొన్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. వాయుకాలుష్యంపై దాఖలైన పిటీషన్లపై శుక్రవారం విచారణ జరిపింది. దిల్లీ ప్రభుత్వం తీరుపై అసహనం, ఆగ్రహం వెలిబుచ్చింది. తాము పదేపదే జోక్యం చేసుకుంటేనే వేగం వస్తుందా అని ఆక్షేపించింది. దిల్లీలో వాయు కాలుష్యానికి పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడమే కారణమా అన్నదానిపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా... దీనిపై అమికస్‌గా ఉన్న అపరాజితా సింగ్ న్యాయస్థానానికి ఓ నివేదిక సమర్పించారు. కాలుష్య మూలాలపై అందులో కీలక విషయాలు పేర్కొన్నారు. మొత్తం కాలుష్యంలో పంటవ్యర్థాల

- మిగతా 2 లో

నిప్పుతో చెలగాటమా?

- గవర్నర్ల తీరుపై సుప్రీం కోర్టు అసహనం
- బిల్లులు వెంటనే ఆమోదించాలని ఆదేశం

న్యూదిల్లీ: కొన్ని రాష్ట్రాల గవర్నరు తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నిప్పుతో ఆడుకుంటున్నారని గవర్నర్లను హెచ్చరించింది. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులు ఎందుకు ఆమోదించడంలేదని సూటిగా ప్రశ్నించింది. అసెంబ్లీ తీర్మానించి పంపిన బిల్లులకు ఆమోదం తెలపడంలో గవర్నర్లు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారంటూ కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్న తరుణంలో భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ తరహా కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రత్యేకించి పంజాబ్, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, తెలంగాణ గవర్నర్లకు సూటిగా తగిలేలా సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసింది. పంజాబ్

- మిగతా 2 లో

4 ఆసుపత్రులపై భీకర దాడులు

- ఇజ్రాయిల్ భూతల పోరు తీవ్రతరం
- అల్ షిఫాపై దాడి: 13మంది మృతి
- ఆసుపత్రులన్నీ ఖాళీ చేయడం అసాధ్యం: గాజా ఆరోగ్యశాఖ

గాజా: భూతల దాడులను ఇజ్రాయిల్ భీకరంగా సాగిస్తున్న క్రమంలో శుక్రవారం నాలుగు ఆసుపత్రులపై వైమానిక దాడులు జరిగాయి. అతిపెద్ద ఆసుపత్రి అల్ షిఫాతో పాటు ఇండోనేసియా ఆసుపత్రి, రాన్‌టిస్సి క్యాన్సర్ ఆసుపత్రి, అల్ ఖుద్దూస్ ఆసుపత్రి, నస్సర్ పిల్లల ఆసుపత్రిని ఇజ్రాయిల్ దళాలు చుట్టుముట్టాయి. ఆయా ప్రాంతాల్లో వైమానిక, భూతల దాడులు జరిపాయి. ఉత్తర గాజాలో ఇజ్రాయిలీ ట్యాంకర్లు బీభత్సం సృష్టిస్తున్నాయి. తాజాగా ఆసుపత్రులపై దాడులతో అక్కడ ఆశ్రయం పొందుతున్న వేలాది మందితో పాటు రోగులు, వైద్యులు, వైద్య సిబ్బంది తరలింపు ప్రశ్నార్థకంగా మారింది. వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. గాజా నగరంలోని ఆసుపత్రులపై ఇజ్రాయిల్ దాడులు జరుపుతోందని షిఫా ఆసుపత్రి డైరెక్టర్ మహమ్మద్ అబూ సులేమాన్ 'రాయిటర్స్'కు తెలిపారు. అయితే

- మిగతా 2 లో

విద్యుత్ వాడకంపై నిఘా

ఇంటింటా బృందాల తనిఖీలు

- సంక్షేమం కోతకు కుట్ర
- లబ్ధిదారుల ఆందోళన
- తెల్ల కార్డుల జారీలో జాప్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ... ప్రభుత్వం నుంచి మరిన్ని రాయితీలు వస్తాయని ఆశిస్తున్న ప్రజలకు ఎదురుదెబ్బ తగులుతోంది. ఒకవైపు 'ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్ ఎందుకు కావాలంటే? పేరుతో...అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 98 శాతం హామీలు అమలు చేశామని నొక్కి చెబుతున్నారు. మరోవైపు వారం రోజుల నుంచి విద్యుత్ మీటర్ల రీడింగ్‌లపై ఆయా శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టడం విమర్శలకు దారి తీస్తోంది. ప్రతినెలా మొదటివారంలో సిబ్బంది వినియోగదారుడి ఇంటికి వచ్చి విద్యుత్ మీటరులో రీడింగ్ తీయడం ఆనవాయితీ. ఈ విడత మీటరు రీడింగ్ తీసిన సిబ్బందిపై మరో పర్యవేక్షణ బృందం ఇంటింటా తనిఖీలు చేయడంతో సంక్షేమ పథకాల లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. విద్యుత్ మీటరును ఆ బృందం పరిశీలించి, వాడిన యూనిట్ల సామర్థ్యాన్ని గుర్తించి, వాటిని ప్రత్యేక ఫార్మెట్‌లో నమోదు చేసి, ఆ వినియోగదారుడి సంతకం తీసుకుంటున్నారు. దీనిపై వినియోగదారులు ఆరా తీయగా...తాము కేవలం పర్యవేక్షణకు మాత్రమే వచ్చామంటూ సమాధానం దాటవేస్తున్నారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో పెద్దఎత్తున విద్యుత్ మీటర్ల రీడింగ్‌ల పర్యవేక్షణ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగానూ ఇదే తరహా చర్యలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. విద్యుత్ యూనిట్ల వినియోగం పెంపుదలను చూపి... తెల్లకార్డులు రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. దీని ఆధారంగా ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకంలో ఉన్నవారికి రాయితీ నిలుపుదల చేయవచ్చు. ఈ తరహా తనిఖీలతో తమకు వచ్చే సంక్షేమ పథకాలకు గండిపడుతుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. సంక్షేమ పథకాలకు కోత వేసే లక్ష్యంతోనే మీటర్ల రీడింగ్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెబుతున్నారు. సంస్కరణల పేరుతో అర్హులను అనర్హులుగా చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇంటింటా విద్యుత్ మీటర్ల రీడింగ్ విధానంపై తనిఖీలు ఎందుకు నిర్వహిస్తున్నారో తెలపాలని వినియోగదారులు నిలదీస్తున్నారు.

ఉచిత విద్యుత్ కుదింపు కోసమేనా?

ఎస్సీ, ఎస్టీల గృహాలకు ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని మళ్లీ కుదిస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే చాలామందిని ఈ పథకం నుంచి ప్రభుత్వం తొలగించింది. గృహ వినియోగదారులకు నిర్ధారించిన నిబంధనల కంటే అధిక యూనిట్లతో విద్యుత్ బిల్లులు వస్తున్నాయనే నెపంతో రాష్ట్రవ్యాప్తంగా చాలామందికి ఉచిత విద్యుత్ పథకాన్ని నిలుపుదల చేసిన సంఘటనలు ఉన్నాయి. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సర్వే నిర్వహించి... ఇంటికి ఏసీలు ఉన్నాయా? కరెంటు బిల్లు ఎంత వస్తోంది? తదితర వివరాలు సేకరించి ఇళ్లకు ఉచిత విద్యుత్ పథకాన్ని నిలిపివేశారు. వాస్తవంగా ఈ పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తున్న ఎస్సీ, ఎస్టీ గృహాలకు జగ్‌జీవన్ జ్యోతి పథకం కింద ప్రభుత్వం నూరుశాతం రాయితీ ఇస్తోంది. అంతకంటే అధికంగా యూనిట్లు వినియోగించే ఎస్సీ, ఎస్టీలు తప్పనిసరిగా విద్యుత్ బిల్లు

- మిగతా 2 లో

అమృత కాలం మిథ్య

తారస్థాయికి నిరుద్యోగం
ఆకలి సూచీలో క్షీణించిన స్థానం
అధికారం కోసమే 'మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ' మాట
అభివృద్ధి నిజమైతే 80 కోట్ల మందికి రేషన్ పంపిణీ ఎందుకు?

న్యూదిల్లీ: ప్రధాని మోదీ మాటలు అరచేతిలో స్వర్గం చూపుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల వేళ వాస్తవాలకు దూరంగా మాటలతో మాయ చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారు. అమృతకాలంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రధాని మోదీ పదేపదే చెబుతున్నారు. అది మిథ్య అని అర్థమవుతోంది. 2028 నాటికి భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందన్న మోదీ మాటల్లో డొల్లతనం కనిపిస్తోంది. తాము వాస్తవాలు పలుకుతున్నామని, ఇది మిథ్య కాదని మోదీ, ఆయన సహచరులు పదేపదే చెబుతున్నారు. అలాంటప్పుడు ఇప్పటికీ 80కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ ఎందుకు పంపిణీ చేస్తున్నారో సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపైనే ఉంది. మరో ఐదేళ్లు రేషన్ పంపిణీ చేస్తామని మోదీ గొప్పగా ప్రకటించారు. దీనిని మోదీ హామీగా చెప్పుకున్నారు. ఎన్నికల వేళ మోదీ ప్రచారార్భాట స్థాయి అంతకంతకూ పెరుగుతూనే ఉంది. మూడవసారి అధికారం కోసం ఆయన తపన కనిపిస్తోంది. నిజంగా ఇది అమృతకాలమే అయితే ఆకలి కేకలు, నిరుద్యోగం ఎందుకు పెరిగాయి? 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ పంపిణీ అవసరం ఎందుకున్నది? ప్రపంచ ఆకలి సూచీలో భారత్ స్థానం ఎందుకు క్షీణిస్తోంది? వంటి ప్రశ్నలకు ఎన్నికల వేళ ప్రాధాన్యత పెరిగింది. ఇటీవల చత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పేదలకు ఉచితంగా రేషన్ అందిస్తున్నట్లు మోదీ ప్రకటించారు. కోవిడ్ కాలంలో తీసుకొచ్చిన పథకాన్ని మరో ఐదేళ్లు పొడించినట్లు గొప్పలు పోయారు. ఇది భారత ప్రజలకు మోదీ ఇచ్చే హామీగా చెప్పుకున్నారు. మూడవసారి ప్రధాని అయ్యాక ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందని ఊదరగొడుతున్నారు. దేశంలో ఎన్నికల కాలం వచ్చింది. దీంతో మూడవసారి అధికారం కోసమే ఆయన పదేపదే మాట్లాడుతున్నారు.

2023 ప్రపంచ ఆర్థిక సూచీలో 125

- మిగతా 2 లో

ఇజ్రాయిల్‌లో అప్రకటిత సైనిక పాలన

నిరసనలపై ఉక్కుపాదం - నేతల అక్రమ అరెస్టులు

2లో

కృష్ణాజలాల పున:పంపిణీ, కరువుపై సీపీఐ 30 గంటల దీక్ష

రైతులను ఆదుకోవడంలో జగన్ విఫలం
ఏపీకి మోదీ సర్కారు ద్రోహం: రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణాజలాల పున:పంపిణీ కోసం కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం, కరువు సమస్యలపై సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీలలో విజయవాడలో 30 గంటల నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. విజయవాడ దాసరి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ ప్రతినిధి బృందం రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో వారం రోజులు పర్యటించిందని, కరువు ప్రాంతాలను సందర్శించి...పంటలు పరిశీలించిందని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో 80 లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా 24 లక్షల ఎకరాల్లోనూ సాగు చేయలేదన్నారు. ఆయకట్టు రైతులు సైతం పంటలు వేయలేకపోయారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ పుట్టపర్తి పర్యటనలో కరువు గురించి ఒక్కమాట మాట్లాడలేదన్నారు. వ్యవసాయ మంత్రి ఏమయ్యారో తెలియడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ యంత్రాంగం కరువు పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోకుండా 'వై ఏపీ నీడ్స్ జగన్' అంటూ తిరుగుతోందని మండిపడ్డారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం సైతం కరువుపై చర్చించలేదని విమర్శించారు. ఇలాంటి మంత్రివర్గం అవసరమా అని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రజలను, రైతులను, వ్యవసాయాన్ని పట్టించుకోని జగన్ ఈ రాష్ట్రానికి అవసరం

- మిగతా 2 లో

సీబీఐకి స్కిల్ కేసు

అభ్యంతరం లేదన్న ప్రభుత్వం
దీనిపై హైకోర్టుకు స్పష్టిచ్చిన ఏజీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసును సీబీఐ విచారణకు ఇవ్వాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పథకం రెండు-మూడు రాష్ట్రాలకు విస్తరించి ఉండటంతో కేసును సీబీఐకి ఇవ్వాలని కోరారు. ఆర్థిక నేరం, జీఎస్టీ ఎగవేత సంబంధించినది కాబట్టి ఈడీ కూడా విచారిస్తోందని తెలిపారు. కేసును సీబీఐకు అప్పగించాలని పిటిషన్‌లో ఉండవల్లి పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీబీఐ డైరెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సీఐడీ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గంటా సుబ్బారావు, కె.లక్ష్మీనారాయణ, నిమ్మగడ్డ వెంకటకృష్ణ ప్రసాద్, డిజైన్‌టెక్ సంస్థ, ఆ సంస్థ ఎండీ వికాస్ ఖన్వేల్కర్, స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్, సీమెన్స్ మాజీ ఎండీ సుమన్ బోస్, మాజీ సీఎం చంద్రబాబు, మాజీమంత్రి అచ్చెన్నాయుడు సహా 44మందిని ప్రతివాదులుగా చేర్చారు. ఉండవల్లి పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా స్కిల్ కేసును సీబీఐకి అప్పగించడంపై తమకు అభ్యంతరం లేదని కోర్టుకు ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ తెలిపారు.

ఈ కేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. కేసుకు సంబంధించి సీబీఐకి ప్రభుత్వం సమాచారం ఇచ్చిందని ఏజీ తెలిపారు. సీబీఐకి ఇవ్వాలని నాలుగేళ్ల క్రితమే తమ వైఖరి స్పష్టం చేశామన్నారు. గత విచారణలో కోర్టు ఆదేశించిన విధంగా నోటీసులు అందరికీ అందలేదని న్యాయవాదులు చెప్పటంతో తదుపరి విచారణను న్యాయమూర్తి ఈనెల 29వ తేదీకి వాయిదా వేశారు. నోటీసులు ప్రతివాదులకు అందజేయడంలో జరిగిన ఆలస్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించారు.



చంద్రబాబు బెయిల్‌పై విచారణ 15కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ప్రధాన బెయిల్ పిటీషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 15కి వాయిదా వేసింది. విచారణకు అదనపు ఏజీ హాజరు కాలేకపోతున్నట్లు సీఐడీ ప్రత్యేక పీపీ వివేకానంద కోర్టుకు తెలిపారు. మరింత సమయం కావాలని ఆయన కోరారు. దీంతో ఉన్నత న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. తొలుత విచారణను ఈ నెల 22కి వాయిదా వేయాలని హైకోర్టును ప్రత్యేక పీపీ అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనను తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం మరోసారి గడువు పొడిగించేది లేదని తేల్చిచెప్పింది.

రాజధాని అసైన్డ్ భూముల కేసు విచారణ హైకోర్టులో వాయిదా

రాజధాని అసైన్డ్ భూముల కేసు విచారణను హైకోర్టు వాయిదా వేసింది. రాజధాని అసైన్ భూముల కేసును రీ ఓపెన్ చేయాలంటూ హైకోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మనల్నడిగితే చెబుతాం కదా..
వై ఏపీ నీడ్స్ జగన్ అని,
ఏం చెప్పలేమా?

ఇజ్రాయిల్‌లో అప్రకటిత సైనిక పాలన

- నిరసనలపై ఉక్కుపాదం - నేతల అక్రమ అరెస్టులు
- మహమ్మద్ బరాకే అరెస్టుకు ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ ఖండన

టెల్అవీవ్: ఇజ్రాయిల్‌లో అప్రకటిత సైనిక పాలన ఉందని ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పేర్కొంది. పార్టీ నేత, ఇజ్రాయిల్ అరబ్ పౌరుల హై ఫాలో అప్ కమిటీ అధిపతి మహమ్మద్ బారాకే అరెస్టును తీవ్రంగా ఖండించింది. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణనకు వ్యతిరేకంగా ఆందోళనకు పిలుపునిచ్చినందుకు మహమ్మద్ బరాకే నిర్బంధానికి గురయ్యారని తాజా ప్రకటనలో తెలిపింది. దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడే హక్కును కాలరేస్తా ఊరుకునేది లేదని తేల్చిచెప్పింది. గాజాలో ఇజ్రాయిల్ దాడులు ఆపాలని చేపట్టే ప్రదర్శనలు, ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతూ అక్రమ అరెస్టులకు పాల్పడుతుండటం ఆక్షేపణీయమని సీపీఐ పేర్కొంది. 'ప్రజాస్వామిక దేశాలు మైనారిటీలను అరెస్టుల ద్వారా భయపెట్టవు. మైనారిటీ నాయకత్వాన్ని నిర్బంధించవు' అని పేర్కొంది. ఇజ్రాయిల్‌లో పలస్తీనియన్ల ఆందోళనలను నిషేధించే అధికారం పోలీసులకు లేదని ఇజ్రాయిలీ సుప్రీంకోర్టు చెప్పిన మరుసటి రోజు ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం గర్హనీయమని ఇజ్రాయిల్‌లోని అరబ్ మైనారిటీ హక్కుల న్యాయ కేంద్రం 'అదాలా' జనరల్ డైరెక్టర్ హసన్ జబరీన్ అన్నారు. పోలీసులు నిరంకుశంగా, కర్కశంగా వ్యవహరిస్తున్నారని, నిరసనగళాన్ని నొక్కేస్తూ, భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని ఆరోపించారు. నేతలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారన్నారు. పలస్తీనియన్ల రాజకీయ కార్యకలాపాలను అడ్డుకోవడమే ఈ చర్యల ఉద్దేశమని తెలిపారు. గాజాలో మారణహోమానికి నిరసనగా ఆందోళనకు పిలుపునిచ్చిన మహమ్మద్ బరాకేను గురువారం ఉదయం ఇజ్రాయిలీ పోలీసులు అరెస్టు చేశారు. నజారెత్‌లో ప్రదర్శన నిర్వహించేందుకు అరబ్ అధికారులకు ఆయన పిలుపునిచ్చారు. ఇందులో సామాన్య ప్రజలు పాల్గొనరు. అయినప్పటికీ ఆదేశాలు ధిక్కరించి ఆందోళనకు పిలుపునిచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న ఆరోపణలను పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నజారెత్ ఆందోళనలో పాల్గొనేందుకు వెళుతుండగా మహమ్మద్ బరాకేను అడ్డుకున్నారు. మరో ఐదుగురు అరబ్-పలస్తీనా రాజకీయ నేతలను, హై ఫాలో అప్ కమిటీ సభ్యులను నిర్బంధించారు. మహమ్మద్ బరాకేను బేట్ షీయన్ పోలీసు స్టేషన్‌కు, మిగతా వారిని మిగ్దాల్ హేమెక్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. నజారెత్‌లోని అల్ అయిన్ స్క్వేర్‌లో ఆందోళన చేపట్టాలని హై ఫాలో అప్ కమిటీ నిర్ణయించినట్లు నజారెత్ పోలీసు కమాండర్‌కు మహమ్మద్ బరాకే ముందు రోజు సమాచారం ఇచ్చారు. 50 మందికిపైగా పాల్గొంటారని తెలిపారు. చట్ట ప్రకారం తమ ఆందోళనకు ముందస్తు అనుమతి అక్కర్లేదన్నారు. తమ సంస్థ కార్యకలాపాలను అడ్డుకోవద్దని పోలీసులను కోరారు. అయినా ఆయనను అరెస్టు చేయడం అక్రమమని, దేశంలో అప్రకటిత సైనిక పాలన ఉన్నదని హర్దాష్ ఎంకే ఐదా టౌమాస్లిమన్ వ్యాఖ్యానించారు.

అవినీతిపై సమగ్ర విచారణ జరగాలి

పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ

లిస్బన్: పోర్చుగీస్‌లో రాజకీయ అనిశ్చితి ఏర్పడిందని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. అవినీతి ఆరోపణలతో ప్రధాని ఆంటోనియో కోస్టా రాజీనామా, వచ్చేఏడాది మార్చిలో సార్వత్రిక ఎన్నికల ప్రకటన క్రమంలో తాజా ప్రకటనను పీసీపీ వెలువరించింది. 2024, మార్చి 10న ముందస్తు పార్లమెంటరీ ఎన్నికలు జరుగుతాయని అధ్యక్షుడు మార్సెలో రెబెలో డీ పౌసా ప్రకటించారు. దీంతో ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ (పీసీపీ) ప్రధాన కార్యదర్శి పౌలో రైముండో వెల్లడించారు. ప్రస్తుత రాజకీయ, సంస్థాగత కార్యాచరణ దృష్ట్యా పార్లమెంటును రద్దు చేసి, ఎన్నికలకు పిలుపునివ్వడాన్ని విస్మరించలేమని తెలిపారు. పీఎస్ ప్రభుత్వ మతతత్వ విధానాలను తిరస్కరించడమే దేశానికి అత్యవసరమని నొక్కిచెప్పారు. వేతనాలు, పింఛన్లు పెరిగేలా ప్రత్యామ్నాయ విధానం అమలు చేయడం, ఎన్‌హెచ్‌ఎస్‌కు హామీఇవ్వడం, అందరికీ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తేవడం, గృహ హక్కు హామీ, పిల్లలు, వారి తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ, సామరస్యత, అభివృద్ధికి హామీ ఇవ్వడం ముఖ్యమని, ఆ దిశగా చర్యలను పాలకులు తీసుకోవాలని సూచించారు. పీసీపీకి, సీడీయూకు సారథ్యం ఉండేలా ప్రత్యామ్నాయ విధానం అమలన్నది కార్మిక, పౌరుల పోరాటాలతోనే సాధ్యమని పౌలో రైముండో పిలుపునిచ్చారు. అవినీతిపై దర్యాప్తులను పూర్తి చేయాలని, అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరగాలన్నారు. తాజా పరిణామలతో ప్రభుత్వం బలహీనపడిందని, పర్యవసానంగా ప్రజలు, కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా మిగిలాయని పౌలో రైముండో వెల్లడించారు.

గ్రీస్ కార్మికోద్యమ నేత మావ్‌రోడోగ్లు కన్నుమూత



ఏథెన్స్: గ్రీక్ కార్మిక-కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) మాజీ ఎంపీ దియామాంటిస్ మావ్‌రోడోగ్లు (99) కన్నుమూశారు. మావ్‌రోడోగ్లు 1924లో జన్మించారు. 1944లో కేకేఈ సభ్యత్వం పొందారు. 1977 నుంచి 1989 వరకు ఆయన ఎంపీగా పనిచేశారు. రెండవ ప్రపంచ యుద్ధముప్పుడు యాక్సిస్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొన్నారు. యునైటెడ్ పాన్‌హెల్లెనిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ యూత్, గ్రీక్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సభ్యునిగా ఉన్నారు. 1978 నుంచి 1996 వరకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా కొనసాగారు. కార్మికోద్యమంలో అనేక బాధ్యతలు చేపట్టారు. గ్రీస్ పింఛన్‌దారుల సమాఖ్య అధ్యక్షుడిగా సేవలు అందించారు. దియామాంటిస్ మావ్‌రోడోగ్లు మృతికి గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. కార్మికవర్గ పోరాటాల్లో గణనీయమైన తోడ్పాటు అందించిన నాయకుడు, నిబద్ధగల కమ్యూనిస్టు అని శ్లాఘించింది.

నాగాలాండ్ మాజీ గవర్నర్ పద్మనాభ ఆచార్య మృతి



ముంబై: బీజేపీ సీనియర్ నేత, నాగాలాండ్ మాజీ గవర్నర్ పద్మనాభ ఆచార్య శుక్రవారం ముంబైలో కన్నుమూసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కర్నాటకలోని ఉడిపికి చెందిన ఆచార్య (92) ముంబైలోని తన ఇంట్లో తుది శ్వాస విడిచారు. ఈయన బీజేపీ మాతృసంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌తో కూడా పనిచేశారు. నాగాలాండ్‌తో పాటు త్రిపుర, అసోం,మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లకు గవర్నర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఆచార్య మృతికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంతాపం వెలిబుచ్చారు.

విద్యుత్ వాడకంపై నిఘా

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించాలి. సంక్షేమ పథకాలను గొప్పగా అమలు చేస్తున్నామని చెబుతున్న జగన్ సర్కారు...ఇలా వ్యవహరించడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు ఉచిత విద్యుత్ రాయితీలపై షరతులు సడలించాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్డుల జారీలో జాప్యం

రాష్ట్రవ్యాప్తంగా చాలామందికి తెల్లకార్డులు(బియ్యం కార్డులు) రద్దయ్యాయి. తెల్లకార్డు ద్వారానే అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తోంది. నాలుగున్నరేళ్ల నుంచి అర్హులైన వారికి తెల్లకార్డులు అందజేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి. గృహ యజమానికి విద్యుత్ బిల్లులు అధికంగా రావడం, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉండటం, ఐటీ తదితర అంశాల్ని ప్రధాన కారణాలుగా చూపుతూ కార్డులు తొలగించింది. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్షలో తెల్లకార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీలు బుట్టదాఖలైనట్లు తెలుస్తోంది. అర్హులకు తెల్లకార్డులు ఇవ్వకుండా, ఉన్న వారికి తొలగించే క్రమంలోనే విద్యుత్ బిల్లుల రీడింగ్‌పై సిబ్బంది తనిఖీలు చేస్తున్నట్లు వినియోగదారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. తెల్లకార్డులు రద్దయితే విద్యుత్ పథకం రాయితీతోపాటు అన్ని సంక్షేమ పథకాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. విద్యార్థులకు జగనన్న అమ్మఒడి పథకం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, మహిళలకు అందజేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కొనసాగింపు నిలిచిపోయే అవకాశాలున్నాయి. సంక్షేమ పథకాల కోతకు ఈ ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తప్పుపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే అర్హులందరికీ బియ్యం కార్డులు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలలో ఎలాంటి కోత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

విచారణ 15కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసును మళ్లీ రీ ఓపెన్ చేయాలని సీఐడీ పిటిషన్‌లో కోరింది. సీఐడీ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణకు వచ్చింది. సీఐడీ విజ్ఞప్తి మేరకు కేసు విచారణను నవంబర్ 22కు హైకోర్టు వాయిదా వేసింది.

ఫైబర్‌నెట్ కేసు విచారణ డిసెంబరు 1కి వాయిదా

ఫైబర్ నెట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణ వాయిదా పడింది. ఈ కేసులో సీఐడీ వేసిన పీటీ వారెంట్‌పై శుక్రవారం విచారణ జరిపిన ఏసీబీ న్యాయస్థానం తదుపరి విచారణను డిసెంబర్ 1కి వాయిదా వేసింది. ఇదే కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 30కి వాయిదా పడింది. ఈనెల 30 వరకు ఏపీ ఫైబర్ గ్రిడ్ కేస్ పీటీ వారెంట్‌పై ఎలాంటి అరెస్టులు చేయవద్దని సుప్రీం ధర్మాసనం తేల్చిచెప్పింది. అలాగే ఫైబర్ గ్రిడ్ కేసులో ఆస్తుల అటాచ్‌మెంట్‌పై విచారణను ఏసీబీ కోర్టు ఈనెల 17కు వాయిదా వేసింది.

చేతనైతే ప్రధానితో మాట్లాడి కరువు నిధులు సాధించండి

బీజేపీ, జేడీఎస్‌పై డీకే విసుర్లు

బెంగళూరు: రాష్ట్రంలో కరువు పరిస్థితులపై బీజేపీ, జేడీఎస్‌లు రాద్ధాంతం చేస్తున్నాయని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు చేపట్టిన కరువు అధ్యయన యాత్రను "పబ్లిసిటీ స్టంట్"గా కొట్టిపారేశారు. చేతనైతే బీజేపీ, జేడీఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రధాని, సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి కరువు సాయం అందేలా చూడాలని సూచించారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి కరువు సాయం అందించడంలో కేంద్రం వివక్ష చూపుతోందని శివకుమార్ విమర్శించారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యులు రాష్ట్రవ్యాప్తంగా కరువు అధ్యయన యాత్ర చేస్తుండగా... జేడీ(ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి తమ పార్టీ 'రైతు సాంత్వాన యాత్ర'ను డిసెంబర్‌లో చేపడుతుందని ఇటీవల చెప్పారు. కరువు పరిస్థితులపై తమ ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించిందని, పరిస్థితిని అంచనా వేయడానికి అధికారుల బృందాన్ని పంపిన కేంద్ర ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించిందని శివకుమార్ చెప్పారు. బీజేపీకి చెందిన 26 మంది ఎంపీలు, జేడీఎస్‌లకు చెందిన 66 మంది ఎమ్మెల్యేలతో పాటు 19 మంది ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి కరువు సహాయ నిధులు తెచ్చుకోవాలన్నారు. తాము ఇప్పటికే ఎండిన పంటలను పరిశీలించామని, నిబంధనల ప్రకారం సహాయ నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. ఇది మా హక్కు అని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 236 తాలూకాల్లో 216 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా కర్నాటక ప్రకటించింది. ప్రభుత్వం రూ. 33,770 కోట్లకు పైగా నష్టాన్ని అంచనా వేసింది. రూ. 17,900 కోట్ల కరువు సాయం కోసం కేంద్రాన్ని కోరిందని శివకుమార్ వివరించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిప్యూటీ కమిషనర్ల వద్ద రూ.800 కోట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆ నిధులను తాగునీరు, పశుగ్రాసం, ఇతర అవసరాలకు వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు.

200లకు పైగా తాలూకాలు కరువుతో అల్లాడుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని రాష్ట్రం నిర్ణయించిందని, ఈ మేరకు కేంద్రానికి లేఖ రాశామని తెలిపారు. సుమారు రెండు నెలలు కావస్తున్నా కేంద్రం నుంచి దీనిపై ఎలాంటి స్పందన లేదన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల డీఏ చెల్లింపుకు ఈసీ బ్రేక్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల కమిషన్ ఊహించని షాక్ ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రభుత్వం వేసిన స్కెచ్ బెడిసి కొట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉన్న వ్యతిరేకతను డీఏ చెల్లింపుతో కొంతైన తగ్గించుకుని వారిని ప్రసన్నం చేసుకుందామనుకున్న ప్రభుత్వ అంచనాలను ఈసీ తలకిందులు చేసింది. తెలంగాణ ఉద్యోగులకు డీఏ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఈ మధ్య ప్రభుత్వం ఈసీకి లేఖ రాసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 2022 జులై నెల డీఏను ఇచ్చేందుకు సిద్ధమైంది. అయితే ఎన్నికల కోడ్ దృష్ట్యా ఈసీ అనుమతి కోసం ప్రభుత్వం లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన లేఖపై ఈసీ కేంద్ర నిఘా సంస్థల ద్వారా పూర్వాపరాలు తెలుసుకుంది. ఏడాదిగా పెండింగ్‌లో పెట్టిన డీఏను ఇప్పుడే ఎందుకు ఇస్తున్నట్టు? మరో మూడువారాల పాటు ఆగలేరా? అంత తొందరేమిటీ? అని ఎన్నికల సంఘం సమాధానం ఇచ్చింది. దీంతో డీఏ విడుదల ప్రక్రియ నిలిచిపోయింది.

దీపావళి సెలవు దినంలో మార్పు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో దీపావళి సెలవు విషయంలో తెలంగాణ సర్కార్ శుక్రవారం కీలక ప్రకటన చేసింది. గతంలో దీపావళి సెలవుగా ప్రకటించిన తేదీలో మార్పు చేసింది. ఈ మేరకు సెలవు దినాన్ని మారుస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన ప్రకటన ప్రకారం నవంబర్ 12వ తేదీని దీపావళి సెలవుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీపావళి సెలవును నవంబర్ 13కు మారుస్తూ శుక్రవారం తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు మార్చిన సెలవు దినాన్ని పాఠశాలలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, సంస్థలు, ప్రైవేటు సంస్థలకు కూడా దీన్ని అమలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

అమృత కాలం మిథ్య

(మొదటిపేజీ తరువాయి)

దేశాల్లో 111వ స్థానంలో భారత్ నిలిచింది. ఈ సూచీని మోదీ ప్రభుత్వ కొట్టిపారేసింది. గరీబ్ కల్యాణ్ అన్న యోజనను మరో ఐదేళ్ల పొడిగించినట్లు ప్రకటించుకుంది. మోదీ ప్రభుత్వం పదేళ్లపాటు పరిపాలన సాగించింది. రాజకీయ ఆర్థికపరంగా మార్పులు తెచ్చేందుకు పదేళ్లలో వృద్ధి, ఉపాధి కల్పన, ప్రైవేటు పెట్టుబడులు, విదేశీ పెట్టుబడులు, ఎగుమతుల్లో మార్పులు తేవచ్చు కానీ ప్రభుత్వం చేసినదేమీ లేదని డేటా చెబుతోంది. ప్రధాని, ఆయన పీఆర్ మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ది కీలక స్థానమని ప్రచారం చేస్తుంటారు. ఎన్నికల కాలంలో ఇటువంటి ప్రకటనలు సామాజిక మాధ్యమాలు, మీడియా ఛానళ్లలో విరివిగా వినిపిస్తాయి కానీ వీటిలోని డొల్లతనం కూడా తొంగిచూస్తునే ఉంటుంది. మోదీ పాలనలో దేశ మధ్యతరగతి ఆదాయం క్షీణించింది. డిమాండ్ ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయికి పడిపోయింది. జనాభాలో 60-70శాతంగా ఉంటే కార్మికులకు చాలాచాలని జీతాలు ఉండటంతో కొనుగోలు శక్తి తగ్గింది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని చెప్పే మోదీ ఈ పదేళ్లలో ఆ పథకానికి చేసినదేమీటి? గ్రామీణ ఉపాధి హామీకి కేటాయించిన బడ్జెట్‌లో 93శాతం కేవలం మొదటి ఆరు నెలల్లోనే ఖర్చు అయిపోయిందంటే దాని పట్ల మోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎంతో అర్థమవుతోంది. ఇది డిమాండ్ ఆధారిత పథకం కాబట్టి కేటాయించిన బడ్జెట్ రూ.60వేల కోట్లు అక్కరకు రావు.

ఈ పదేళ్లలో అధిక జీడీపీ వృద్ధికి మోదీ హామీనివ్వలేకపోయారు. తొమ్మిదేళ్లుగా అది 5.7 శాతంగా ఉంటోంది. 2014లో ఇచ్చిన హామీ ప్రకారం ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇవ్వడంలో ఘోరంగా విఫలమయ్యారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలోనూ వైఫల్యం చెందారు. ఈ పదేళ్లలో పెరిగిన ఎంఎస్‌పీకి సాగు వ్యయాన్ని పోల్చితే అంతా తేటతెల్లమవుతుంది కాబట్టి ఆయన ఇప్పుడు మరో ఐదేళ్లు ఉచిత రేషన్ ఇస్తానని వాగ్దానం చేశారు. 2022 జులై నుంచి 2023 జులై వరకు జరిగిన కార్మికశక్తి సర్వే నివేదికలో మోదీ ప్రభుత్వ ఆర్థిక వైఫల్యం కనిపించింది. 2022-23లో ఉపాధి పొందే వారిలో 53శాతంగా స్వీయ ఉపాధి పొందేవారు ఉన్నారు. నోట్ల రద్దు, కోవిడ్ మహమ్మారి కారణంగా చిరు ఉద్యోగులు, చిరు విక్రేతలు, చిరు వ్యాపారుల స్థితి దెబ్బతిన్నది. ఐదేళ్లుగా వేతనాలు పెరగలేదు. జీవవ్యయం అమాంతం పెరిగింది. దీంతో కొనుగోలు శక్తి తగ్గింది. ముఖ్యంగా గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. హిందుస్తాన్ లీవర్, బజాజ్ ఆటో తదితర కంపెనీలకు గ్రామీణ స్థాయిలో డిమాండ్ తగ్గిపోయింది. ఐదారేళ్ల కిందటి విక్రయాలతో పోల్చితే బజాజ్ ఆటో సేల్స్ 30-40శాతం తగ్గాయి. మరోవైపు ఎస్‌యూవీలు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్, హోటళ్లు, విమానయానం సంబంధిత కంపెనీల విక్రయాలు పెరిగాయి.

నిప్పుతో చెలగాటమా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తీవ్ర ఆందోళన కలిగించే అంశమని సుప్రీం పేర్కొంది. ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు స్పష్టంచేసింది. ఇదే సందర్భంలో నిప్పుతో ఆటలాడుతున్నారని పంజాబ్, తమిళనాడు గవర్నర్లను ఉద్దేశిస్తూ సుప్రీం వ్యాఖ్యానించింది. బిల్లులను ఆలస్యం చేయవద్దని స్పష్టమైన సూచన చేసింది. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగులో ఉన్న అంశంపై పంజాబ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మరోసారి విచారించింది. ఏళ్ల తరబడి భారతదేశం సంప్రదాయాలకు అనుగుణంగా నడుస్తోందని, వాటిని అనుసరించాల్సిన అవసరం ఉందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. బిల్లులకు ఆమోదం తెలపకపోవడంపై పంజాబ్ గవర్నర్‌ను ఉద్దేశిస్తూ.. 'మీరు నిప్పుతో చెలగాటమాడుతున్నారు' అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. అసెంబ్లీ సమావేశం రాజ్యాంగ విరుద్ధమని గవర్నర్ పేర్కొనడాన్ని తప్పుపట్టింది. ఇదే సమయంలో ప్రొరోగ్ చేయకుండా అసెంబ్లీని ఎందుకు వాయిదా వేశారని పంజాబ్ ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. కాగా, బిల్లుల పెండింగు విషయంపై ఇటీవల జరిగిన వాదనల సమయంలోనూ గవర్నర్ జాప్యంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులనే వాస్తవాన్ని గవర్నర్లు విస్మరించరాదని న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయంపై గవర్నర్లు తమ పనితీరుపై చిన్నపాటి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం కనిపిస్తోందని తెలిపింది.

మేం చెబితేనే కదులుతారా?

(మొదటిపేజీ తరువాయి)

దగ్ధం 24 శాతం మేర ప్రభావం చూపుతోందని తెలిపారు. బొగ్గు మండించడం వల్ల 17 శాతం, వాహనాల నుంచి వెలువడే పొగతో 16 శాతం గాలి కాలుష్యానికి కారణమని తెలిపారు. 'ప్రతి ఒక్కరికీ కాలుష్యం మూలం తెలిసినప్పటికీ.. వారంతా కోర్టు జోక్యం కోసం ఎదురుచూస్తున్నారు. మన వద్ద ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. కానీ ఎవరూ ఏమీ చేయరు. కోర్టు కూడా ఫలితం కావాలని చెబుతుంది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తాము ప్రయోగాత్మకంగా స్మాగ్ టవర్లను ప్రారంభించామని, వర్షాకాలంలో వాటిని ఉపయోగించే వీలులేదని ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ కమిటీ ప్రతినిధి కోర్టుకు వెల్లడించారు. దీనిపై కోర్టు స్పందిస్తూ... క్షేత్రస్థాయిలో పరిష్కారాలు అమలు కావాలని మాత్రమే తాము చూస్తామని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఇంతకుముందు విచారణలో భాగంగా ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన 'సరి-బేసి' విధానంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి విధానాలు తక్కువ ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నది. దానిపై వివరణ ఇవ్వాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో నేడు ఆప్ సర్కారు న్యాయస్థానానికి అఫిడవిట్ దాఖలు చేసింది. సరి-బేసి విధానం సానుకూల ప్రభావం చూపుతుందని శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడించాయి. దీనిద్వారా ప్రజా రవాణా వినియోగం పెరగడంతో పాటు 15 శాతం ఇంధన వినియోగం తగ్గుతుందని పేర్కొంది.

4 ఆసుపత్రులపై భీకర దాడులు

(మొదటిపేజీ తరువాయి)

హమాస్ సైనికులను మట్టుపెట్టడమే తమ లక్ష్యమని, వారు ఆసుపత్రుల కింద ఏర్పాటు చేసుకున్న భూగర్భ కమాండ్ కేంద్రాలు, సొరంగాల్లో నక్కి ఉన్నారని, వారి ఏరివేతే లక్ష్యమని ఇజ్రాయిల్ సైన్యం చెబుతోంది. ప్రపంచానికి స్కూళ్లు, ఆసుపత్రులు, స్కౌట్ గ్రూపులు, పిల్లల ఆట స్థలాలు, మసీదులు కనిపిస్తుంటే హమాస్‌కు మాత్రం వేధించే అవకాశం కనిపిస్తుందని వ్యాఖ్యానించింది. ఇప్పటివరకు అనేక మంది హమాస్ కమాండర్లను మట్టుబెట్టినట్లు తెలిపింది. నఖ్బా కమాండర్లు అహ్మద్ మౌసా, అమర్ అల్హంది హతమైనట్లు ఐడీఎఫ్ వెల్లడించింది.

అందరినీ తరలించలేం: ఖిద్రా

గాజా ఆరోగ్యశాఖ అధికార ప్రతినిధి అష్రాఫ్ అల్ ఖిద్రా 'రాయిటర్స్'తో మాట్లాడుతూ గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఐదు సార్లు అల్ షిఫా ఆసుపత్రిపై బాంబులతో దాడి జరిగినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని ప్రశూతి విభాగం, ఓపీ క్లినిక్‌ల విభాగంపై తెల్లవారు జామున దాడులు జరిగాయన్నారు. అల్ షిఫాపై దాడుల్లో 13 మంది చనిపోగా అనేక మంది గాయపడ్డారని రాయిటర్స్‌కు తెలిపారు. దాడులు జరుగుతండటంతో చాలా మంది అక్కడి నుంచి తరలిపోతున్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. శరణార్థులు అందరినీ ఖాళీ చేయించడం అసాధ్యమని ఖిద్రా వెల్లడించారు. '45 మంది చిన్నారులు ఇంక్యుబేటర్లలో ఉన్నారు. 52 మంది పిల్లలు ఐసీయూల్లో చికిత్స పొందుతున్నారు. అలాగే వందల సంఖ్యలో గాయపడిన వారు, ఇతర రోగులు ఉన్నారు. వేలాది మంది నిరాశ్రయులు కూడా ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. వీరందరినీ సురక్షితంగా తరలించడం అసాధ్యమ'ని ఖిద్రా తెలిపారు. కాగా, పలస్తీనాలో మృతుల సంఖ్య 10,812కు పెరిగిందన్నారు.

నాలుగు గంటల విరామానికి ఇజ్రాయిల్ అంగీకారం

మానవతా కారిడార్ల ద్వారా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి, బందీల విడుదలకు ఉత్తర గాజాలో దాడులకు రోజూ నాలుగు గంటల విరామం ఇవ్వడానికి ఇజ్రాయిల్ అంగీకరించింది. అయితే కాల్పుల విరమణ ఉద్దేశం లేదని, హమాస్ అంతమే లక్ష్యమని మరోమారు ఉద్ఘాటించింది. అనుకున్నది సాధించే వరకు పోరు ఆగబోదని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. అందుకు ఎంత సమయం పట్టినా పర్వాలేదని, తమ దళాలు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. అయితే గాజాలో ఎక్కువ కాలం ఉండిపోయే యోచనగానీ ప్రణాళికలు గానీ లేవన్నారు. గాజాను పాలించే ఉద్దేశంగానీ ఆక్రమించే ఆలోచనగానీ లేదని చెప్పారు. హమాస్ ఉనికి లేకుండా చేయడమే కాకుండా ఆసంస్థ మరలా పుట్టుకురాకుండా నిరోధించడానికి వీలుగా చర్యలు తీసుకుంటామని, గాజా నగరాన్ని పునర్నిర్మించాలని, అక్కడ ప్రజా ప్రభుత్వం రావాలని ఆకాంక్షిస్తున్నట్లు నెతన్యాహు తెలిపారు. ఆ ప్రాంతానికి మెరుగైన భవిష్యత్ ఇవ్వాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలావుంటే, శిథిలాల్లో చిక్కుకుపోయిన శవాల ఆచూకీ తెలుసుకునేందుకు గద్దలు, రాబందులను ఇజ్రాయిల్ రంగంలోకి దించింది. వాటికి జీ ట్యాగ్ చేయడం ద్వారా మృతదేహాలను గుర్తించే ప్రయత్నం చే గుర్తించే ప్రయత్నం చేస్తోంది.

34 శాతానికి పేదరికం: ఐరాస హెచ్చరిక

ఇజ్రాయిల్ భీకర దాడుల కొనసాగింపు పలస్తీనాలో పేదరికాన్ని గణనీయంగా పెంచేస్తాయని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. పేదరికం రేటు 34శాతానికి చేరుకుంటుందని పేర్కొంది. ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ), పశ్చిమాసియా ఆర్థిక సామాజిక కమిషన్ (ఈఎన్‌సీడబ్ల్యూఏ) సంయుక్తంగా 'గాజాలో పోరు, పలస్తీనాపై సామాజిక, ఆర్థిక ప్రభావం శీర్షికన' నివేదికను విడుదల చేశాయి. పలస్తీనా జీడీపీ 8.4శాతానికి క్షీణిస్తుందని నివేదిక తెలిపింది. ఇప్పటికే పేదరికం రేటు 20శాతానికి పెరుగగా మరో నెలపాటు దురాక్రమణ కొనసాగితే 34శాతానికి చేరుతుందని వెల్లడించింది. పలస్తీనాలో ఆర్థిక వృద్ధి రేటు 4.2శాతం క్షీణించినట్లు పేర్కొంది. అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌ఓ) ప్రకారం సుమారు నాలుగు లక్షల మంది ఉపాధి కోల్పోయినట్లు వెల్లడైంది. ఇజ్రాయిల్-హమాస్ పోరు మూడవ నెలకు చేరుకుంటే పేదరికం 45శాతానికి పెరిగి ఆరున్నర లక్షల మందికిపైగా పేరికంలోకి నెట్టబడతారని నివేదిక తెలిపింది. మానవఅభివృద్ధి సూచిలో క్షీణత కనిపిస్తుందని హెచ్చరించింది. పలస్తీనాలో అభివృద్ధి దాదాపు 16ఏళ్ల వెనకకు... గాజా అభివృద్ధి 20ఏళ్లు వెనకకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఇప్పటికే 50శాతానికిపైగా నివాసాలు నాశనం కాగా గాజా నగరం శిథిలమైనట్లు ఐరాస పేర్కొంది.

అమెరికా, బ్రిటన్‌లో నిరసనలు

పలస్తీనాకు మద్దతుగా ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. అమెరికాలో మీడియా కార్మికులు ఆందోళనకు దిగగా ఈశాన్య ఇంగ్లండ్‌లోని బేయి సిస్టమ్స్ ఫ్యాక్టరీ ప్రవేశ మార్గాలను వేలాది మంది నిరసనకారులు శుక్రవారం దిగ్బంధించారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయించవద్దన్న డిమాండ్‌తో బ్రిటన్‌కు అతిపెద్ద రక్షణ సరఫరా కర్మాగారాన్ని ఘెరావ్ చేశారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు ఇవ్వొద్దు అన్న ప్లకార్డులు, ఈ ఫ్యాక్టరీ మారణహోమానికి ఆయుధాలు సరఫరా చేస్తుందన్న భారీ బ్యానరు, పలస్తీనా జెండాలు ప్రదర్శించారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును గౌరవిస్తాం. ఇజ్రాయిల్, గాజాలోని తాజా పరిస్థితి భయాందోళనకు గురిచేస్తోంది. పౌరులను ప్రభావితం చేస్తోంది. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం కావాలని ఆకాంక్షిస్తున్నాం. ఇజ్రాయిల్‌కు నేరుగా ఆయుధాలు సరఫరా చేయం' అని పేర్కొంది. మరోవైపు పలస్తీనాకు మద్దతుగా వందలాది మంది మీడియా కార్మికులు అమెరికా, మ్యాన్‌హాటన్‌లోని న్యూయార్క్ టైమ్స్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గాజాలో కాల్పుల విమరణ అమలునకు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్-హమాస్ పోరుపై వార్తల్లో వివక్షను దుయ్యబట్టారు. 'రైటర్స్ బ్లాక్' అధ్వర్యంలో మీడియా సిబ్బంది నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇప్పటివరకు మరణించిన 36 మంది జర్నలిస్టుల పేర్లను ప్రచురించిన పేజీలను ప్రదర్శించారు. 'ది న్యూయార్క్ వార్ క్రైమ్స్' కథనాలు ఇజ్రాయిల్‌కు మద్దగా ఉన్నాయంటూ ఆయా ప్రతులను చింపివేశారు. కాల్పుల విరమణకు బహిరంగంగా మద్దతు పలకాలని ఎడిటోరియల్ బోర్డును డిమాండ్ చేశారు. ఇటీవల గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్, స్టాట్యూ ఆఫ్ లిబర్టీ వద్ద పలస్తీనాకు అనుకూలంగా ప్రదర్శనలు జరిగిన విషయం విదితమే.

సీపీఐ 30 గంటల దీక్ష

(మొదటిపేజీ తరువాయి)

లేదని స్పష్టంచేశారు. తక్షణమే పంట నష్టాలు అంచనా వేయించి, కరువు మండలాలను ప్రకటించాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్, ఉపాధి కల్పన ద్వారా వలసలు ఆపాలని డిమాండ్ చేశారు. నరేంద్రమోదీ ప్రభుత్వం కృష్ణా జలాల పునః పంపిణీ పేరుతో ఏపీకి ద్రోహం చేస్తోందని రామకృష్ణ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ కేంద్రం కొత్త కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

కర్నాటక ఎన్నికల సందర్భంగా వివాదాస్పద ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి...దాని నిర్మాణానికి ఆఘమఘాలపై రూ.5,300 కోట్లు కేటాయించిందని ఆరోపించారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల సందర్భంగా కృష్ణాజలాల పున:పంపిణీ అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. సీఎం జగన్ ఢిల్లీలో ఉండగానే మోదీ ప్రభుత్వం కృష్ణాజలాల పున:పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం జగన్ అసమర్థత కారణంగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సీపీఐ 30 గంటల నిరసన దీక్షలో రాష్ట్ర, జిల్లాల పార్టీ నాయకత్వం పాల్గొంటుందన్నారు. దీక్షను జయప్రదం చేయాల్సిందిగా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిరసన దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌కు మోదీ సర్కారు మద్దతు పలకడం దారుణం

అక్కినేని వనజ

విశాలాంధ్ర-రాజమండ్రి: అమెరికా సామ్రాజ్యవాదుల విష వలయంలో పలస్తీనా చిక్కుకుందని, ఆ దేశ ప్రజలపై యుద్ధాన్ని ఆపాలని, శాంతితోనే ఉగ్రవాదాన్ని రూపుమాప గలమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు. వామపక్షాల పిలుపు మేరకు పలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ నిరసిస్తూ... శుక్రవారం ఉదయం స్థానిక తాటితోట సెంటర్లో సీపీఐ, సీపీఎం తూర్పు గోదావరి జిల్లా కమిటీ అధ్వర్యంలో నిరసన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ స్టేడియం వరకు ర్యాలీ చేపట్టారు. యుద్ధాన్ని ఆపాలి... శాంతిని పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా పలస్తీనాకు సంఘీభావంగా మరొక స్వాతంత్ర్య సమరం జరగకపోతే భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదంలో మరిన్ని వర్తమాన దేశాలు చిక్కుకునే ప్రమాదం పొంచి ఉందన్నారు. పలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు భారత ప్రభుత్వం మద్దతు పలకడం దారుణ మని ఆమె అన్నారు. ఇప్పటికే అమాయకులైన పదివేల మంది పలస్తీనీయులు చనిపోయారన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం గాజా ప్రాంత ప్రజానీకానికి మంచినీరు, విద్యుత్తు, ఆహార సరఫరా నిలిపివేసి అంతర్జాతీయ చట్టా లను ఉల్లంఘిస్తూ యుద్ధ నేరాలకు పాల్పడు తోందన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నప్పటి నుంచి పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఉన్న భారత విదేశాంగ విధానానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. 1947లో ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు పలస్తీనాను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడమే ఈ సమస్యకు పరిష్కారమన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ... ఇజ్రాయిల్ మూడున్నర లక్షల మంది సైన్యంతో గాజా సిటీని ముట్టడించి... ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకోవడం తప్ప ఒక్క హమాస్ నేతని సజీవంగా బంధించింది లేదని, వారి వద్ద బంధీగా ఉన్న ఒక్క రినీ విడుదల చేయించలేదన్నారు. సమస్యకు యుద్ధం పరిష్కారం కాదని, చర్చల ద్వారానే సాధ్యమని ఇజ్రాయిల్ పౌరులు కూడా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వీ కొండలరావు, జట్టు లేబర్ యూనియన్ కార్యదర్శి సప్ప రమణ, సీపీఎం నగర కార్యదర్శి పవన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీ రాజులోవ, నాయకులు ఎస్ఎస్ మూర్తి, జె.రాంబాబు, సిపిఐ నాయకులు సేపేని రమణమ్మ లక్ష్మి, ఎడ్ల లక్ష్మి, సిదగం నవరోజి, నల్ల రామారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మారణహోమం వెంటనే ఆపాలి

విశాలాంధ్ర-తిరుపతి: పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, సామ్రాజ్యవాద అమెరికా యుద్ధోన్మాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని వామపక్ష నాయకులు నినదించారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఉన్న గాంధీ బొమ్మ వద్ద వామపక్షాల అధ్వర్యంలో పలస్తీనాకు సంఘీభావంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు నాగ సుబ్బారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వెంకటరత్నం, ఎస్‌యుఎస్‌ఐ (కమ్యూనిస్టు) జిల్లా నాయకులు ప్రతాప్ సింగ్, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ... గాజాపై ఇజ్రాయిల్ మారణకాండలో వేలాది మంది అమాయక పౌరులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. శరణార్థుల శిబిరాలపై కూడా ఇజ్రాయిల్ బాంబుదాడులు చేయడం దారుణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నా అమెరికా ప్రోత్సాహంతో ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదని వాపోయారు. సామ్రాజ్యవాద అమెరికా తన ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్ ను తన బ్రాంచ్ ఆఫీసుగా చేసుకుని యుద్ధాన్ని ప్రేరేపిస్తుందన్నారు. పలస్తీనా ప్రజల ఆకాంక్ష మేరకు వారికి స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేయాల్సింది పోయి... అక్కడి ప్రజలను అణచి వేస్తున్నారని దుయ్యబట్టారు. అమెరికా వైఖరిని ప్రపంచ దేశాలన్నీ వ్యతిరేకించాలన్నారు. ప్రపంచ శాంతి కాముక దేశాలన్ని ఐక్యమై పలస్తీనాకు మద్దతుగా నిలబడాలన్నారు. ఇజ్రాయిల్ బాంబు దాడులను తక్షణమే ఆపాలని, పలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రపంచ దేశాలన్నీ గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు జల్లా విశ్వనాథ్, టీ సుబ్రహ్మణ్యం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కేతారి రాధాకృష్ణ, నగర కార్యవర్గ సభ్యులు ఎస్ డి రవి, ఎం శివ, కేవై రాజా, రామకృష్ణ, బలరాం, పద్మనాభరెడ్డి, సీహెచ్ శివ, కాలయ్య, మహేంద్ర, శ్రీరాములు, రామచంద్రయ్య, గోవిందస్వామి, బాబు, అల్లా బాషా, ఎల్కే నాయుడు, సీపీఎం నాయకులు వేణు, బుజ్జి , సీపీఐ (ఎంఎల్) నాయకులు గంగా, మునీంద్ర ఎస్‌యుఎస్‌ఐ నాయకులు హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ పుస్తక వారోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ పుస్తక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఉదయం సొసైటీ భవనంలోని వేమూరి అనిల్ కుమార్ సాహిత్య వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుక్ ఫెస్టివల్ సొసైటీ లైబ్రరీ భవనంలోని వేమూరి అనిల్ కుమార్ సాహిత్య వేదిక ప్రాంగణంలో ఈ జాతీయ పుస్తక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజ్ఞాన సముపార్జనకే కాక సమాజాన్ని జాగృత పర్చడంలో పుస్తక ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. ఈ జాతీయ పుస్తక వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా డిసెంబర్ చివరిలో పుస్తక మహోత్సవాన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జి మాట్లాడుతూ నవంబరు 14వ తేదీన బాలల దినోత్సవం, జాతీయ పుస్తక వారోత్సవాలు, గ్రంథాలయ వారోత్సవాలు కలిసి రావటం విశేషమన్నారు. పుస్తక ప్రదర్శనలో నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేసుకోవచ్చని కూడా తెలిపారు. ఏడు రోజులు ఒక్కొక్క రోజు ఒక్కొక్క అంశంపై సాహితీ ప్రసంగాలుంటా యన్నారు. విద్యార్థులు,పుస్తక ప్రియులు,విద్యాసంస్థలు ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని... మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ 14వ తేదీ ఉదయం 10 గంటలకు పుస్తక వారోత్సవాలను ఏపీ స్టేట్ మైనారిటీస్ వెల్ఫేర్ సంచాలకులు ఏ మహమ్మద్ ఇంతియాజ్ (ఐఏఎస్) ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ బహుమతి గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ పాల్గొంటారని తెలిపారు. 15వ తేదీ నుంచి సాయంత్రం 6 గంటలకు సాహిత్య సభలు జరుగుతాయని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సొసైటీ కోశాధికారి కే రవి, సంయుక్త కార్యదర్శి గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

బీజేపీతో మూడు పార్టీల మ్యాచ్ ఫిక్సింగ్

శ్రీనివాసరావు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వైసీపీ, జనసేన, టీడీపీ, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయని, రాష్ట్రంలో విచిత్ర రాజకీయ పరిస్థితి ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు పార్టీల మధ్య మాయ నడుస్తోందన్నారు. వైసీపీ, బీజేపీ నేతలు రాష్ట్రంలో తిట్టుకుంటున్నారని, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ పరస్పరం సహకరించుకుంటున్నాయని, మద్దతు ఇచ్చుకుంటున్నాయని, ఇదేమీ రాజకీయమని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ మూడోసారి మోదీ ప్రధాని కావాలని, అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, అదే బీజేపీ ఇక్కడ వైసీపీ ప్రభుత్వాన్ని నడిపిస్తోందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో వైసీపీతో పోరాడుతున్నామని చెబుతున్న జనసేన కేంద్రంలో బీజేపీతో కలిసి పనిచేస్తోందని, ఇక్కడ తెలుగుదేశంతో కలిసి రాజకీయ ప్రచారం చేస్తోందని, తెలుగుదేశం కూడా జనసేనతో కలిసి నడుస్తామని చెబుతోందన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పోటీచేయడం లేదని చెబుతుంటే, దానితో ఏపీలో కలిసి పనిచేస్తున్న జనసేన అక్కడ బీజేపీతో ఎన్నికల్లోకి వెళ్లిందని, ఎన్‌డీఏ కూటమిలోనూ ఉందని, ఈ నేపథ్యంలో తెలుగుదేశం నాయకులు బీజేపీ పట్ల వారి వైఖరి ఏమిటో చెప్పాలన్నారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ వైఖరి స్పష్టం చేయాలని కోరారు. మహిళలు, దళితులు, మైనార్టీలు, ఆదివాసీలను అణచివేస్తున్న బీజేపీకి మద్దతు ఇవ్వడం ద్వారా వారికి ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అన్ని సందర్భాల్లోనూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న బీజేపీతో కలిస్తే ప్రజలకు న్యాయం చేయలేరని అన్నారు.

ధూళిపాళ్ల కబ్జాలో సంగం డెయిరీ

మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సంగం డెయిరీని టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర కబ్జా చేశారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. ధూళిపాళ్ల ట్రస్టు పేరుతో ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, దీనిపై ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తోందని చెప్పారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు కొల్లగొట్టడంలో చంద్రబాబు, ఆయన అనుచరులు ఎంతో నైపుణ్యం సాధించారని ఆరోపించారు. ఏ దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా పశువుల ఆరోగ్యాన్ని చూసి ఆ ప్రాంత అభివృద్ధిని నిర్ధారించవచ్చునని మహాత్మా గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం 2019-20 మొదటి బడ్జెట్ సమావేశంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో మహాత్ముని సూచనను గుర్తుచేసి తన విధానాన్ని స్పష్టం చేశారన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో పశుసంవర్థక శాఖను బలోపేతం చేయడంతో పాటు ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. డెయిరీలను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలుగా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతోందన్నారు. రాష్ట్రంలో సహకార డెయిరీలు దాదాపు నిర్వీర్యమయ్యాయని, దీనికి కారణం నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలేనని విమర్శించారు. చాలా డెయిరీలను కంపెనీ చట్టంలోకి తీసుకెళ్లి తమ సొంత ఆస్తుల్లా గుత్తాధిపత్యం చెలాయించుకునేలా చేశారని మండిపడ్డారు. చిత్తూరు డెయిరీని చంద్రబాబు దెబ్బతీశారని ఆరోపిస్తూ... సంగం డెయిరీ ధూళిపాళ్ల నరేంద్రకు ఎలా వచ్చింది... ఆ డెయిరీ ఎవరిది... అది ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. సంగం డెయిరీకి సంబంధించి ధూళిపాళ్ల నరేంద్రపై ఏసీబీ కేసులున్నాయని గుర్తుచేశారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణంలో డిసెంబర్ 18,19 తేదీలలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 10వ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ రామచంద్రయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. దీనికి రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యుడు బీటీ చిన్నాన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిలుగా హాజరైన రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే జగన్నాథం మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌లో కరువు పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కర్నూలు జిల్లాలో 22 కరువు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి రైతాంగాన్ని బలోపేతం చేయాలన్నారు. కరువుతో పశ్చిమ ప్రాంతంలో 50 వేలకు పైగా కుటుంబాలు వలసలు వెళు తున్నప్పటికీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఎల్ సి ఆనకట్టు ద్వారా వేసిన పంటలకు కాలువ ద్వారా జనవరి చివరి వరకు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని, అదే విధంగా హంద్రీనీవా కాలువ ద్వారా 106 చెరువులకు నీళ్లు నింపాలని రైతు సంఘం అనేక దఫాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం 72 చెరువులకు నీరు నింపే కార్యక్రమం చేపట్టి, చేతులెత్తే సిందని వారు తెలిపారు. ఈ తరుణంలోనే జిల్లా రైతాంగ సమస్యల సాధన కోసం ఎమ్మిగనూర్ పట్టణంలో డిసెంబర్ 18, 19 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 10వ జిల్లా మహాసభలు నిర్వహించబోతున్నామని... జిల్లా నలుమూలల నుండి రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్న గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, రైతు సంఘం నాయకులు కేసీ జబ్బర్, మాలిక్, షరీఫ్, ఖాజా, వీరేష్, తిమ్మ గురుడు, నాగప్ప, గిడ్డయ్య, సుంకన్న, మల్లికార్జున గౌడ్, నరసింహులు, రోషన్, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంటరుణాలివ్వాలి

జమలయ్య డిమాండ్

లీడ్ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, పంటల కోతల సమయంలో పెట్టుబడి అవసరమని, భూ యజమానితో సంబంధం లేకుండా రుణాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రూ.4 వేల కోట్ల పంట రుణాలు ఇవ్వాల్సి ఉండగా... కేవలం రూ.518 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా లీడ్ బ్యాంకుల వద్ద శుక్రవారం ఆందోళనలు చేసింది. పి.జమలయ్య, కౌలు రైతుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు తలారి రామారావు, ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతుల సంఘం నాయకులు బుడ్డి రమేష్, పెయ్యల వెంకటేశ్వరరావు, జి.దేవరాజు తదితరుల బృందం విజయవాడలోని కృష్ణాజిల్లా లీడ్ బ్యాంకు (ఇండియన్ బ్యాంకు)అసిస్టెంట్ మేనేజర్ ఎస్. సత్యమూర్తికి, ఎన్టీఆర్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసింది. అనంతరం జమలయ్య మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2.50 లక్షల మంది కౌలు రైతులు ఉంటే 90 వేలమందికే గుర్తింపు కార్డులు జారీ చేశారని, కార్డులు పొందిన వారికి పంట రుణాలు ఇవ్వడానికి అనేక షరతులు పెడుతున్నారని చెప్పారు. కౌలు గుర్తింపు కార్డులు పొందిన రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం చెబుతోందన్నారు. ఆచరణలో బ్యాంక్ అధికారులు పంట రుణాలు ఇవ్వకుండా కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. అందువల్ల ప్రైవేటు వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు పంట రుణాలు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారని వివరించారు. ఈ ఏడాది వర్షాభావం వలన పంటలు చేతికొచ్చే సమయానికి సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, నిల్వ ఉన్న పంటలు కాపాడుకోవడానికి పెట్టుబడి అవసరమని, ఇప్పటికైనా పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. ప్రతినెలా కౌలు రైతులతోనూ, సంఘాల ప్రతినిధులతోనూ, బ్యాంకు అధికారులు బ్యాంకు పరిధిలో సమావేశాలు నిర్వహించి రుణాలు మంజూరును సమీక్షించాలని కోరారు.

బ్యాంకులు పట్టించుకోవడం లేదు : కాటమయ్య

విశాలాంధ్ర-పుట్టపర్తి: కౌలు రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పుట్టపర్తి లీడ్ బ్యాంక్ అధికారి వివేక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చినప్పటికీ బ్యాంకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల హక్కుల చట్టం 2019 ప్రకారం సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు పొందిన రైతులకు ఎలాంటి హామీ లేకుండా రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. రుణాలు పొందిన కౌలు రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు, లంక భూములు సొసైటీ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా పంట రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేవీ రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, గౌస్ లాజం, సీపీఐ పుట్టపర్తి పట్టణ కార్యదర్శి, రైతులు సోము, రాము తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ కార్యాలయాలుగా సచివాలయాలు

వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాలను అధికార పార్టీ కార్యాలయాలుగా వైసీపీ మార్చివేసిందని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. గుంటూరులోని జన చైతన్య వేదిక కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అంటే' అనే పార్టీ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగంతో సచివాలయాల కేంద్రంగా నిర్వహించడం భారతదేశ చరిత్రలోనే మొదటిసారి అని లక్ష్మణరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 2.66 లక్షల మంది వలంటీర్లు, 15 వేల సచివాలయాల్లో పనిచేస్తున్న 1.3 లక్షల మంది సచివాలయ సిబ్బందిని అధికార పార్టీ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం రాజ్యాంగ విరుద్ధమని దుయ్యబట్టారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కలిసి రానున్న ఎన్నికలలో రాజకీయ లబ్ధి కోసం ప్రచారం చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. అధికార కార్యక్రమాలలో సీఎం వైఎస్ జగన్ ప్రతిపక్ష పార్టీల నేతలను విమర్శించడం అధికార దుర్వినియోగంగానే భావించాలన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య విభజన రేఖను తుడిచివేయడం, ప్రభుత్వ సొమ్ముతో అధికార పార్టీ కోసం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుందని హితవు పలికారు. సచివాలయం వద్ద వైసీపీ జెండాలు ఎగురవేయడం, బ్యానర్లు కట్టడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీపీ మురళీ కృష్ణారావు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, పన్ను చెల్లింపుదారుల సంఘం అధ్యక్షుడు ఒ.నారాయణరెడ్డి, సామాజిక ఉద్యమకారులు ఎస్.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు గుర్తింపు

బస్సుయాత్రలో ముత్యాలనాయుడు, ధర్మాన, రాజన్న దొర

విశాలాంధ్ర-సీతానగరం/పార్వతీపురం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి చేసిన విజయాలను, అభివృద్ధి, సంక్షేమం గూర్చి తెలియజేయడమే సామాజిక సాధికారత యాత్ర ప్రధాన లక్ష్యమని ఉపముఖ్యమంత్రులు బూడి ముత్యాల నాయుడు, పి.రాజన్నదొర, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం శాసనసభ నియోజకవర్గంలో సామాజిక సాధికారత యాత్ర(బస్ యాత్ర) శుక్రవారం జరిగింది. ముందుగా లచ్చయ్యపేటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, కొమురం భీమ్, అల్లూరి సీతారామరాజు ఆశయాలకు అనుగుణంగా వైసీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమ, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయని, తమ ప్రభుత్వం మాత్రం చేతల ద్వారా చూపిస్తోందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల కలైన పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేలు మరువలేనిదన్నారు. అనంతరం 500 ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా పార్వతీపురం వెళ్లింది. మధ్యలో సీతానగరం మండలం కాసాపేట గ్రామ సచివాలయాన్ని మంత్రి ముత్యాల నాయుడు ప్రారంభించారు. అప్పయ్యపేటలో మధ్యాహ్న భోజనం తరువాత పార్వతీపురంలో సామాజిక సాధికారత యాత్ర లక్ష్యాలు, ప్రతిపక్ష పార్టీల తీరును, ఒకవర్గం మీడియా తీరుపై మండిపడ్డారు. ఎన్నడూ అధికారం చూడని వర్గాలకు సీఎం జగన్ పదవులు ఇచ్చారని మంత్రులు తెలిపారు. టీడీపీలో డబ్బున్నవారు, పెత్తందార్లు పదవులు అనుభవించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త, టీటీడీ పాలక మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి, ఎంపీలు గొడ్డేటి మాధవి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు జోగారావు, పాముల పుష్పశ్రీవాణి, విశ్వాసరాయి కళావతి, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎస్సీ కమిషన్ సభ్యురాలు ఎస్.జయమణి, ఎమ్మెల్సీ శ్రీకాంత్, కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ స్వాతి రాణి, దాసరి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ రమాదేవి, నియోజకవర్గ పరిశీలకులు శోభాహైమావతి, జెడ్పీ మాజీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు తదితర రాష్ట్ర, జిల్లానేతలు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నది. నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన కార్యక్రమాలు చేపడతామని టీడీపీ నాయకులు హెచ్చరించిన నేపథ్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయ్‌చంద్ర తదితరులను గృహ నిర్బంధం చేశారు. అయినా టీడీపీ కార్యకర్తలు బస్‌యాత్రకు నల్లబెలూన్లతో నిరసన తెలిపారు.

తక్షణం మహిళా కోటా అమలు చేయాలి

అక్కినేని వనజ డిమాండ్

విశాలాంధ్ర-రాజమండ్రి: మహిళా రిజ్వరేషన్ చట్టాన్ని 2024 సార్వత్రిక ఎన్నికలలోనే అమలు చేయాలని, అందుకోసం మహిళా లోకం గళమెత్తాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర పూర్వ అధ్యక్షురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు స్థానిక సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం సేపని రమణమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. అక్కినేని వనజ మాట్లాడుతూ మహిళలకు చట్టసభలలో రిజర్వేషన్ల కోసం సీపీఐ ఎంపీ గీతాముఖర్జీ చివరిశ్వాస వరకు పోరాడారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో నాడు బీజేపీ నోరు విప్పలేదని విమర్శించారు. ఇప్పుడు ఆమోదం పొందిన మహిళా చట్టాన్ని ఎప్పుడో అమలు చేస్తామని మోదీ సర్కారు చెప్పడం మోసం చేయటమేనని వనజ విమర్శించారు. మణిపూర్‌లో ఇప్పటికీ హింస కొనసాగుతోందని, అయినా కేంద్రం నోరు విప్పడం లేదన్నారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవటాన్ని తీవ్రంగా ఖండించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డివిరుస్తునన నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య చేపట్టనున్న భవిష్యత్ కార్యక్రమాలను ఆమె వివరించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.5వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17, 18, 19 తేదీలలో నంద్యాలలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కాగా, మహిళా సమాఖ్య జిల్లా నూతన కన్వీనింగ్ కమిటీని సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లా కన్వీనర్‌గా సిడగ దుర్గ, కో కన్వీనర్‌గా ఎం.ముత్యాలు, కమిటీ సభ్యులుగా సేపని రమణమ్మ, బేగం, కోడబాల వరలక్ష్మి, కొండవతి, బంగారు దుర్గాలక్ష్మి, జగ్గమ్మ, రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, కె.ఉష ఎన్నికయ్యారు.

సంపాదకీయం

బెయిలు మంజూరు చిక్కుముడి

ఎవరైనా బెయిలుకోసం న్యాయస్థానాన్ని అర్థిస్తే న్యాయమూర్తులు న్యాయసూత్రాలను దృష్టిలో ఉంచుకుని విచక్షణాధికారాన్ని వినియోగించి బెయిల్ మంజూరు చేయాలో లేదో నిర్ణయించాలి అన్నది సువ్యవస్థితమైన న్యాయసూత్రం. అదే సమయంలో నిందుతుడిపై మోపిన ఆరోపణల తీవ్రతను, ప్రాసిక్యూషన్ (ప్రభుత్వ పక్షం) విచారణ కొనసాగిస్తున్న తీరును కూడా న్యాయమూర్తులు పరిగణనలోకి తీసుకోవాలి. నియమాలు, నిబంధనల మాట ఎలా ఉన్నా బెయిలు మంజూరు చేయాలో వద్దో నిర్ణయించుకోవడంలో న్యాయమూర్తులకు విచక్షణాధికారాన్ని ఉపయోగించే అవకాశమూ ఉంది. విచక్షణాధికారం వ్యక్తిగత అభిప్రాయాల మీద ఆధారపడిందని చెప్పక్కర్లేదు. న్యాయమూర్తుల వ్యక్తిగత అభిప్రాయాలు కూడా సంపూర్ణంగా న్యాయబద్ధంగా, చట్టానికి, తర్కానికి కట్టుబడి ఉంటాయని చెప్పడానికి అవకాశం లేదు. తమకు కిట్టని వారిని న్యాయస్థానాల తీర్పుతో నిమిత్తంలేకుండా కేవలం ఆరోపణల ఆధారంగానే సుదీర్ఘ కాలం జైలులో ఉంచడానికి అనువైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.) లాంటివి ఉన్నాయి. డబ్బు అక్రమ చెలామణి నిరోధక చట్టం (పి.ఎం.ఎల్.ఎ.) కూడా ఈ జాబితాలోకే వస్తుంది. పాలకవర్గాలు తమ ప్రత్యర్థులను వేధించ దానికి ఇలాంటి చట్టాలను బలాదూరుగా ఉపయోగించుకుంటాయి. ఉమర్ ఖాలిద్ లాంటి వారు యు.ఎ.పి.ఎ. చట్టం కింద ఏళ్ల తరబడి బెయిలు కూడా రాకుండా జైలులో మగ్గుతూ ఉంటే దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా లాంటి వారు పి.ఎం.ఎల్.ఎ. కింద అదే రీతిలో నెలల తరబడి జైలు గోడల వెనకే ఉండిపోయారు. భీమా కోరేగావ్ కేసులో అయిదేళ్ల నుంచి జైలులో ఉన్నవారున్నారు. బెయిలుహక్కు, తప్పనిసరి అయినప్పుడే జైలు అని అత్యున్నత న్యాయస్థానం ఎన్ని సార్లు చెప్పినా అత్యున్నత న్యాయస్థానం తాను చెప్పిన సూత్రాన్ని తానే విస్మరిస్తోంది. విచారణకు ముందే దీర్ఘ కాలం జైలులో ఉంచడం సహజ న్యాయసూత్రాలకే విరుద్ధం. విచారణ జరగకుండానే, కొన్ని సందర్భాలలో సమగ్రమైన చార్జ్‌షీట్ దాఖలు కానందువల్ల నెలలు, ఏళ్ల తరబడి జైలులో మగ్గిపోవాల్సి వస్తోంది. నిందితుడు విచారణకు హాజరు కాకుండా తప్పించుకుంటాడేమోనన్న అనుమానం ఉన్నప్పుడో, లేదా ఆ నిందితుడు స్వేచ్ఛగా తిరిగితే సమాజానికి అపకారం జరుగుతుందని భావించినప్పుడో తప్ప బెయిలు నిరాకరించనవసరం లేదని మన న్యాయస్థానాలు అనేక సార్లు చెప్పాయి. కానీ ఆచరణలో అవే న్యాయస్థానాలు తాము నిర్దేశించిన సూత్రాలనే విస్మరిస్తున్నాయి. ఈ విస్మరణ న్యాయసూత్రాలను పరిగణించకపోవడంవల్ల కావొచ్చు. లేదా అధికారంలో ఉన్న వారి ఆంతర్యానికి అనుగుణంగా మెలగితే పోలేదా అనుకునే న్యాయమూర్తులు ఉన్నందువల్లా అయి ఉండొచ్చు. ముఖ్యంగా కింది కోర్టులు బెయిలు మంజూరు చేయడానికి జంకుతున్నట్టు కనిపిస్తోంది. అలాంటి స్థితిలో కింది కోర్టుల దగ్గర్నుంచి మొదలు పెట్టి హైకోర్టు, సుప్రీంకోర్టు మెట్లు ఎక్కవలసి వస్తోంది. ఏ సందర్భాలలో బెయిలు మంజూరు చేయవచ్చునన్న అంశంలో విధి విధానాలు, నిర్దేశాలు సవివరంగా ఉన్నప్పుడు వాటిని లెక్కలోకి తీసుకోక పోవడంవల్లే నిందితులు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసి వస్తోంది. ఇది అనేక రకాలుగా వృథా ప్రయాసగా మిగిలిపోతోంది. బెయిలు మీద నిందితుడు విడుదలైతే తన కేసులో తనను తాను సమర్థించుకోవడానికి తగిన అవకాశం దక్కుతుంది. ఇది నిజానికి ఎంతటి నిందితుడికైనా ఉన్న, లేదా ఉండవలసిన హక్కు

దిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను గత ఫిబ్రవరి 26న అరెస్టు చేశారు. బెయిలుకోసం ఆయన ఎక్కని కోర్టు మెట్లు లేవు. కానీ అన్ని చోట్లా చుక్కెదురే అవుతోంది. గత 30వ తేదీన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, ఎస్.వి.ఎన్. భట్టితో కూడిన బెంచి సిసోడియాకు బెయిలు మంజూర్ చేయడానికి నిరాకరించడానికి చెప్పిన కారణం వింతగా ఉంది. ఆరు నుంచి ఎనిమిది నెలలలోగా ఈ కేసులో విచారణ పూర్తి చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినందువల్ల ఆయనకు బెయిలు మంజూరు చేయలేదట. అంటే ఆ దర్యాప్తు పూర్తయ్యే దాకా సిసోడియాకు ఆరు నుంచి ఎనిమిదినెలల వరకు బెయిలు మంజూరు అయ్యే అవకాశం లేదనేగా! న్యాయమూర్తులు ఇలాంటి వైఖరి అనుసరించడం ఆశ్చర్యకరం. ఒకవేళ విచారణలో జాప్యం అవుతోందని వచ్చే మూడు నెలల కాలంలో భావిస్తే మళ్లీ బెయిలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని కూడా న్యాయమూర్తులు సెలవిచ్చారు. త్వరగా విచారణ పూర్తి చేయాలని ఆదేశించే అధికారం ఉన్న న్యాయాధీశులే విచారణ జాప్యం అయితే అని మాట్లాడడం వింతే. కొందరు రాజకీయ నాయకుల మీద అవినీతి ఆరోపణలు కొత్త కాదు. కొందరు నాయకుల మీద క్రిమినల్ కేసులూ ఉన్నాయి. రాజకీయ కక్ష సాధించడంకోసం కూడా అధికారంలో ఉన్న వారు కేసులు మోపవచ్చు. కాని కొన్ని కేసుల్లో నిజమూ ఉండొచ్చు. అవినీతి, డబ్బు అక్రమణ చెలామణి కేసుల్లో నిందితులైన వారు కేసులు, విచారణలాంటి వాటి బాధ ఓర్వలేక అధికార పార్టీలో చేరిపోతున్నారు. అంతటితో వారి మీద విచారణకు తెరపడ్తోంది. అలాంటి స్థితిలో ఒకప్పుడు దాఖలు చేసిన కేసు అమాంతం ఎందుకు తెరమరుగైందో ప్రశ్నించకుండా న్యాయవ్యవస్థ మౌనంగా ఉండడం ఏ రకంగా న్యాయమో అంతు పట్టదు. తమ ముందుకు ప్రస్తావనకు వచ్చిన అంశాలకు పరిమితమై న్యాయస్థానాలు పని చేస్తాయన్నది నిజమే. కానీ సామాన్యుడు కూడా అధికార పక్షం దాష్టీకాన్ని, చట్టాల దుర్వినియోగాన్ని, కక్ష సాధింపు ధోరణిని అర్థం చేసుకుంటున్నప్పుడు న్యాయస్థానాలు ఇవి తమ ముందుకు రాలేదని నిశ్చింతగా ఉండేంత దడి కట్టుకు కూర్చున్నాయా అన్నది అసలు ప్రశ్న. ఏ చట్టాన్ని ఉల్లంఘించడమైనా నేరమే. అనుమానం లేదు. కానీ చట్టాలకు సృజనాత్మక భాష్యం చెప్పే అవకాశం న్యాయవ్యవస్థకు ఉందన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. క్రియాశీలమైన న్యాయవ్యవస్థ ఇలాంటి సందర్భాలలో కూడా చట్టాలకు సృజనాత్మకంగా భాష్యం చెప్తుంది. ఉమర్ ఖాలిద్, మనీశ్ సిసోడియా, సంజయ్‌సింగ్ మొదలైన వారికి బెయిలు మంజూరు విషయంలో న్యాయమూర్తులు ఈ క్రియాశీల తత్వాన్ని, సృజనాత్మక వింగడింపును అనుసరిస్తున్నట్టు లేదు. అదే సమయంలో శరీరంలో 90శాతం సహకరించని డా.సాయి బాబాను విడుదల చేయకపోవడం న్యాయస్థానాల మానవీయ దృక్పథా రాహిత్యానికి నిదర్శనం. డా.బినాయక్ సేన్‌కు ఇచ్చిన సదుపాయం సాయిబాబాకు ఎందుకు వర్తించదో! చట్టాలను రూళ్ల కర్రలా భావించినందువల్లే భీమా కోరేగావ్ కేసులో అరెస్టయిన స్టాన్ స్వామి పోలీసు నిర్బంధంలోనే ప్రాణాలు వదిలారు. ఈ విషాదాన్ని న్యాయవ్యవస్థ ఏ రకంగా సమర్థించు కోగలుగుతుందో! నియమోల్లంఘనను నివారించడం న్యాయవ్యవస్థ బాధ్యత అయినట్టే ప్రభుత్వంతో సహా ఎవరు నియమోల్లంఘనకు పాల్పడ్డా అడ్డుకట్ట వేయడంలో న్యాయవ్యవస్థ బాధ్యత మరింత ఎక్కువే. ప్రభుత్వం చట్టాలను దుర్వినియోగం చేస్తే వినాశనమే జరుగుతుంది. బెయిలు హక్కు అయినప్పుడు విపరీత పరిస్థితులు ఉన్నప్పుడు మినహా బెయిలు మంజూరు చేయడానికి నిరాకరించడం అన్యాయం. ప్రభుత్వానికి అనుకూలంగా నడుచుకోవలసిన బాధ్యత న్యాయవ్యవస్థకు లేదు. న్యాయాన్యాయ విచక్షణే ఆ వ్యవస్థ కర్తవ్యం.

మళ్ళీ విజృంభిస్తున్న టీ మస్కిటో బగ్

గత సంవత్సరం ఆగస్టు నెలనుంచి తెలంగాణలో డై బ్యాక్ వ్యాధి వల్ల వేపచెట్టు ఆకులు కాల్చినట్లు ఎర్రగామారి చనిపోవడం జరుగుతుంది. వేప తెగులు టీ మస్కిటో బగ్, హెలోపెల్టిస్ ఆంటోని రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో, టీ మస్కిటో బగ్‌వల్ల వేపచెట్లు అనారోగ్యానికి గురయ్యాయి. తత్ఫలితంగా, ఆకులు మొలకెత్తిన దశలోనే వంకరగా మారి చనిపోతాయి. మొదట ఇగుర్లుతో మొదలై చివరకు మొత్తం చెట్టు నాశనం అవుతుంది. ఈ వైపరీత్యంతో రైతులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయశాఖ వారికి తెలియ చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. చెవిటి వాడి ముందు శంఖం ఊదిన చందంగా ఉంది. ఎన్నికలు, విత్తన పంపిణీ, ఇతర పనులతో తీరిక లేకుండా ఉన్నామని జవాబిస్తున్నారు. వేప చెట్లు అటవీ శాఖ పరిధిలో ఉన్నాయని చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులను ఎలా సంప్రదించాలో తెలియదు. ప్రాణాంతకమైన డైబ్యాక్ వ్యాధి నుండి వేప చెట్లు కాపాడడానికి ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు ప్రజల భాగస్వామ్యంతో చెట్లను రక్షించడానికి ముందుకు వచ్చి సమాజ శ్రేయస్సు కోసం నివారణ చర్యలు చేపట్టాలి. వేప ఒక అద్భుత జాతిగా పరిగణించారు. ఇది కాలుష్యం, అటవీ నిర్మూలన, నేల కోత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి ప్రధాన ప్రపంచ సమస్యలను తొలగించగలదు. శాస్త్రవేత్తలు దాని పెద్ద-స్థాయి పరిరక్షణ ఈ గ్రహంలోని ప్రతి వ్యక్తికి ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే, గత కొన్ని నెలలుగా, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో వేప జాతులు ఈ వ్యాధికి బలైపోయాయి. గత సంవత్సరం పర్యావరణవేత్తల బృందం శంషాబాద్, షాద్‌నగర్, మొయినాబాద్, ఘటకేసర్, మేడ్చల్ మండలాల్లో గౌతమ్ బుద్ధ డెవలప్‌మెంట్ సొసైటీ, ప్రజాసైన్సు వేదిక, లయన్స్ క్లబ్ సౌజన్యంతో ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాన్ని ప్రారంభించింది. సైనికపురి, అల్వాల్, కొంపల్లి, మండలంలో ఇతర గ్రామాలలో ఈ వ్యాధి ద్వారా అంతరించి పోతున్న వేప చెట్లను కాపాడేందుకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య గురించి అవగాహన తీసుకురావడానికి, ఈ బృందం ఈ విలువైన జాతులను కాపాడే పద్ధతులపై పరిజ్ఞానాన్ని అందించింది. గత కొన్ని నెలలుగా, వాలంటీర్లు తెలుగు రాష్ట్రాలలో, కర్ణాటక పరిసర ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల్లో ప్రభావితమైన వేప చెట్లకు చికిత్స చేస్తున్నారు. గ్రామాల సరిహద్దులో ఉన్న ప్రధాన రహదారులు, రహదారులపై వందలాది చెట్లను కాపాడారు. పరిశోధనలు, అధ్యయనాలు తెలంగాణలో చాలా ప్రదేశాలలో డైబ్యాక్ వ్యాధి ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించాయి. కొమ్మలు లేదా పువ్వులు ముడతతో లేదా దాని పండ్లు పూర్తిగా కుళ్ళిపోవడంతో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం వ్యవసాయ అటవీ శాఖ వారు స్వచ్ఛంద సేవా సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి పర్యావరణం పై జాగరూకత కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యం. సురేష్ బాబు, లయన్ డా. యం. విరూపాక్షరెడ్డి తెలిపారు. "ఇది ప్రధానంగా షాట్ హెూల్ బోర్ వ్యాధి (ఒక ప్రధాన తెగులు), ఇక్కడ కీటకాలు కొమ్మలలో చిన్న రంధ్రాలు కాండం భాగాన్ని కలిగి ఉంటాయి తరువాత, రంధ్రాలు ఫంగస్‌కు ప్రవేశ కేంద్రంగా మారుతాయి. ప్రారంభ దశలో చికిత్స చేయకపోతే, అది చెట్ల మరణానికి కారణమవుతుంది. అన్ని వయసుల పరిమాణాల జాతులు ఈ సమస్యతో బాధపడతాయని పర్యావరణ నిపుణులు అంటున్నారు. వేప ఒక హరిత ఆకురాల్చే చెట్టు, ఇది ప్రపంచ పర్యావరణ సమస్యలను పరిష్కరించడానికి ప్రసిద్ధి చెందింది. అయితే ఇది సూక్ష్మజీవుల వ్యాధుల నుంచి విముక్తి పొందదు. ఈ వ్యాధి భయంకరమైన వృద్ధితో వ్యాపిస్తుంది. చాలా వేగంగా నియంత్రించాల్సిన అవసరం ఉంది. తీవ్రంగా ప్రభావితమైన చెట్ల, పండ్ల ఉత్పత్తిలో 100 శాతం నష్టం ఉంది.ప్రాజెక్ట్ ట్రీ నిర్వాహకులు గోలి అర్చనరెడ్డి మాట్లాడుతూ, "మేము ఈ ప్రచారాన్ని రంగారెడ్డి జిల్లాలోని కొన్ని గ్రామాలకు తీసుకువెళ్ళాము ఈసారి అనేక చెట్లను కాపాడగలిగాము అని సంస్థ కార్యదర్శి ప్రొ.వి.సిద్ధారెడ్డి వివరించారు. ఇటీవల, ట్రీ లైఫ్ అడ్వెంచర్ నిర్వహించిన శిబిరంలో, ప్రజలు ఈ ప్రచారంలో పాల్గొనడానికి ముందుకు వచ్చారు. వ్యాధి చికిత్సకు స్థానికంగా లభించే మందులను ఎలా ఉపయోగించవచ్చో మేము చూపించాము.

డా. అఖిలమిత్ర

పలస్తీనాలో నాలుగు లక్షల ఉద్యోగాలకు నీళ్లు

సి. ఆదికేశవన్

పలస్తీనా, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాలలో మొత్తం 3,90,000కుపైగా ఉద్యోగాలు కోల్పోయి నానాపాట్లు పడుతున్నారు. అలాగే రోజువారి పనిచేసే కూలీలు ఇంతవరకు 16మిలియన్ డాలర్ల మేరకు ఆదాయాన్ని కోల్పోయారు. ముందు ముందు ఇజ్రాయిలీల దాడి ఇంకా కొనసాగినట్లయితే మానవీయ సంక్షోభం మరింత అధికమవుతుంది. గాజాస్ట్రిప్‌లో గత నెలరోజులకుపైగా ఇజ్రాయిల్ సైన్యం జరుపుతున్న దాడిలో 61శాతానికిపైగా ఉద్యోగాలు ఊడిపోయాయి. ఇజ్రాయిల్ పెద్దఎత్తున దాడులుచేస్తున్న కారణంగా గాజా స్ట్రిప్‌లో 1,82000 మందికిపైగా ఉద్యోగాలను కోల్పోయారు. గాజా చుట్టుపక్కల ప్రాంతంలో మౌలిక సదుపాయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వ్యాపారాలు దాదాపుగా మొత్తం మూసివేశారు. షాపులన్నీ ధ్వంసం చేశారు. పెద్ద సంఖ్యలో పలస్తీనాలు దేశాన్ని విడిచిపెట్టి వలసవెళ్లారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు నీరు, ఆహారం,ఇంధనం, లభ్యం కాకపోవడం వల్ల ఇక్కడ ఆర్థిక కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయని విలేకరుల సమాచారం. ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య తదితర అంశాలను ఐఎల్‌ఓ వెల్లడించింది. కార్మిక మార్కెట్‌పైన తీవ్రమైన ప్రతికూల ప్రభావంచూపి మానవీయ సంక్షోభం మరింత ఇనుమడించింది. గాజాలో ఆక్రమిత ప్రాంతాల ప్రజలకు జీవనభృతి కూడా కరువైందని వార్తలు తెలియజేస్తున్నాయి. విషాద ఘట్టానికి సంబంధించిన ప్రాథమిక అంచనాల ప్రకారం, ప్రత్యేకించి రోజువారీ కూలీలను, ఇతర మార్కెట్‌లో పనిచేసి జీవిస్తున్నవారిని తీవ్రంగా దెబ్బతీసింది. ప్రజలతోపాటు మనిషి అవసరాలుకూడా అందకుండా ఉన్నాయి. వ్యాపారాలకు, ప్రజల జీవనానికి భీకరంగా జరుగుతున్న దాడులు ఎంతో ఆటంకంగా ఉన్నాయి.

గాజాప్రాంతంలో మానవీయ భద్రతా చట్టంకింద పౌరులు, ఆక్రమిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఆటంకం లేకుండా వేగంగా సురక్షితంగా ఆహారధాన్యాలను అందించాలని ఐఎల్‌ఓ గవర్నింగ్ బాడీ కోరుతున్నది. ఐక్యరాజ్యసమితి ప్రభుత్వంతో కలిసి అవిశ్రాంతంగా పనిచేస్తూ సహాయం అందిస్తున్నది. మానవతావాదులు తక్షణం కార్మికులకు, వ్యాపారవేత్తలకు సహాయాన్ని అందించేందుకు ఐక్యరాజ్యసమితి పనిచేస్తున్నది. కార్మిక మార్కెట్‌లో పనిచేస్తున్నవారి సంఖ్య వారి పనిపరిస్థితులను తక్షణం తెలుసుకుని తమకు అందచేయాలని ఐరాస విజ్ఞప్తి చేస్తున్నది. ఐఎల్‌ఓ మూడు దశల కార్యక్రమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నది. సహాయం, సమీక్ష, రికవరీలను చేపట్టాలని నిర్ణయించింది. పలస్తీనా లేబర్ మార్కెట్‌లో జీవన భృతిలో కలిగిననష్టాన్ని ఐఎల్‌ఓ అంచనా వేస్తున్నది. వెంటనే మద్దతు పథకాలు, వెస్ట్‌బ్యాంకులో నిలిచిపోయిన ప్రజలకు భద్రత కలిగించాలని ఐఎల్‌ఓ కోరింది. నష్టపోయిన ప్రజలకు 1.1మిలియన్ డాలర్ల సహాయాన్ని అందచేసింది. రెండవదశలో బాధితుల సమాచారం సేకరణ, వారికి అందించవలసిన ప్రణాళిక, కల్పించవలసిన ప్రాధాన్యత లాంటి కార్యక్రమాలను చేపడుతుంది. ఉపాధి, ఉద్యోగాల, మౌలిక సదుపాయాలను వేగంగా కల్పించేందుకు తగిన ఉద్యోగాలను సృష్టించడం, సామాజిక భద్రతకోసం ఉద్యోగాలను, వ్యాపారాలను పునరుద్ధరించడంపైన ఐక్యరాజ్యసమితి శ్రద్ధవహిస్తోంది. ఐఎల్‌ఓ గవర్నింగ్ బాడీ 349వ సమావేశం సందర్భంగా 20 మిలియన్ డాలర్లను మూడు దశల కార్యక్రమానికి ఖర్చు చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు.

కార్మికుల ప్రదర్శనలు

ఇజ్రాయిల్‌కు ఆయుధాలను సరఫరా చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఐరోపా అంతటా కార్మికులు భారీ ప్రదర్శనను నిర్వహించారు. నిరసన ప్రదర్శనలు, రహదారులకు అడ్డంకులు కల్పిస్తూ పలస్తీనాకు సంఘీభావాన్ని తెలియజేస్తూ ట్రేడ్‌యూనియన్‌లు, విభజన సంఘాలు పాల్గొన్నాయి. ఐరోపాలోని ఆయా ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌కు సహాయం అందించడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ మానవహననం చేస్తున్నప్పటికీ, ఆయా దేశాల ప్రభుత్వాలు వ్యతిరేకించక పోవడాన్ని విమర్శించారు. మానవహననం కొనసాగిస్తూ బాంబుదాడులు చేస్తున్నారు. దాదాపు నెలరోజులుగా కార్మికులు ఐరోపా వ్యాప్తంగా పలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ ప్రదర్శనలు చేస్తున్నారు. గ్రీకు ట్రేడ్ యూనియన్లు అన్ని కార్మికుల మిలిటెంట్ ఫ్రంట్ ఏథెన్స్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అకస్మికంగా ప్రదర్శనచేసి పలస్తీనాకు సంఘీభావం తెలియజేశారు. ఇజ్రాయిల్ ఎయిర్‌లైన్స్ ఈఐఏఎల్ కార్యాలయం ముందు అలాగే విమానాశ్రయం లోపలికివెళ్లి యుద్ధాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధనేరాలను ఆల్ వర్కర్స్ మిలిటెంట్‌ఫ్రంట్ తీవ్రంగా ఖండించింది. గాజా ప్రాంతంలో పదినిమిషాల్లో దారుణంగా ఒక బాలుడిని హతమార్చిన ఘటన ప్రజలందరినీ ఆశ్చర్యపరిచింది. అంతా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గాయపడిన 15వేలమందికి ఎలాంటి వైద్యసహాయం అందించకుండా ఎనలేని కష్టాలు పెట్టారు. గ్రీకు ప్రభుత్వం అన్నిరకాల ఆర్థిక, రాజకీయ, సైనిక సహకారం ఇజ్రాయిల్‌కు అందించవద్దని ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేశాయి. తూర్పు జెరూసలేం రాజధానిగా 1967లో గుర్తించిన సరిహద్దులతో స్వతంత్రదేశాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ గట్టిగా డిమాండ్ చేసింది. బ్రిటన్, డెన్మార్క్‌లలో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా వివిధ యుద్ధగ్రూపులు అలాగే డెన్మార్క్ కమ్యూనిస్టు యూత్ కలిసి డెన్మార్క్ ఆయుధాల కంపెనీ డెర్మాను ఆయుధాలు సరఫరాచేయవద్దని డిమాండ్ చేశాయి.

ఐ-మెయిల్

5కేజీల ఉచిత బియ్యంతో ప్రభుత్వ రేషన్‌కే ఎసరు!

ఇటీవల ప్రధాని మోదీ చత్తీస్‌ఘడ్ ఎన్నికల సభలో ప్రసంగిస్తూ 80 కోట్ల మంది పేదలకు ప్రధాని 'గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా లభించిన 5కేజీ ఉచిత బియ్యాన్ని మరొక ఐదుసంవత్సరాలు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి ఈ 5కేజీల ఉచిత బియ్యం ఇవ్వడం ద్వారా గత యూపీఏ ప్రభుత్వం 2013లో ప్రవేశపెట్టిన జాతీయాహార సురక్షిత పథకాన్ని ప్రధాని అన్న యోజనగా పేరు మార్చి, వారికి చౌకగా లభించవలసిన బియ్యం, వంటనూనె, పప్పు దినుసులు ఇవ్వడం నిరాకరిస్తున్నారు. పైగా ఈ వాదన ప్రకటన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించటమే.

2020 ఏప్రిల్‌లో కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో పేదలకు 5కేజీ ఉచిత బియ్యంతోపాటు వారికి చౌకరేటుకు లభించే మరొక 5కేజీల బియ్యం కలిపి మొత్తం 10కేజీలు ఇవ్వటం ప్రారంభించారు. కానీ ఇటీవల ప్రధాని ప్రకటనతో కేవలం 5కేజీల ఉచిత బియ్యం ఇవ్వడమైంది. మిగిలిన 5కేజీల సబ్సిడీ బియ్యం, ఇతర దినుసుల వితరణ పూర్తిగా రద్దు చేసారు. అంటే ఒక చేత్తో ఇస్తూ, మరొక చేతితో వారికి చట్టపరంగా 2013లో ఆహారపథకం ద్వారా లభించాల్సిన బియ్యాన్ని, ఇతర దినుసులను వెనక్కి తీసుకోవటమే.

పైగా రేషను కార్డుల వితరణ పదమూడు సంవత్సరాల క్రితం(2011) జనాభా లెక్కల అనుసారంగా అమలు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో పేదల సంఖ్య అపారంగా పెరిగింది. తరచు పట్టణాలకు తరలివెళ్లే వలస కార్మికులకు ఈ పథకం లభించదు. ఏప్రిల్ 2020లో సుప్రీం ధర్మాసనం దేశంలోని దాదాపు 8కోట్ల వలస కార్మికులకు చౌకబియ్యం పంపిణీ ఏ మాత్రం అందుబాటులో లేదని, వారి సంఖ్య 8కోట్ల మందికి పైబడిందని, వారికి సత్వరం దేశంలో ఏ మూలనున్నా పంపిణీ చేసే వ్యవస్థను రూపొందించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కానీ ఈ ఆదేశాన్ని ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి.

దేశంలో అధిక ధరలతో పేద ప్రజలు అల్లాడిపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం కేజీ 50రూపాయలు, కందిపప్పు 150రూపాయలు, వంటనూనెలు 130 రూపాయాలు పలుకుతున్నాయి. ఇప్పటికీ ప్రపంచంలో లెక్కించిన 125 దేశాల మధ్య భారతదేశం 111వ స్థానంలో ఉంది. దేశంలో 33కోట్ల టన్నుల ఆహారధాన్యాలు పండిస్తున్నా, ఆకలి కేకలు తగ్గలేదు. ఈ నేపధ్యంలో అర్హులైన పేదలందరికీ ఉచిత బియ్యం కలుపుకొని ప్రభుత్వ పంపిణీ పథకం ద్వారా లభించే సబ్సిడీ బియ్యం, పప్పులు,నూనెలను పునరుద్ధరించాలి.

డా. సోమ మర్ల

భద్రత లేని కాంట్రాక్ట్ లెక్చరర్లు

ప్రపంచంలోని ఏ దేశ లేదా రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు ఆ దేశ ఉన్నత విద్య నాణ్యతను బట్టి ఉంటాయి. మొత్తంగా 55 రాష్ట్ర కేంద్రీయ, ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయి. అందులో రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలు 31 కాగా, వీటిలో 10 సాంప్రదాయ విశ్వవిద్యాలయాలు, 19 స్పెషలైజేడ్ యూనివర్సిటీస్ రెండు పిపిపి మోడల్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం అధ్యాపక విద్యార్థుల నిష్పత్తి 1:20గాను ఏఐసిటి ఈ నిబంధనల ప్రకారం 1:15గా ఉండాలి. రాష్ట్ర ఉన్నత విద్యలో 12 లక్షల నుంది విద్యార్థులు ఉంటే ఒక్క ఆంధ్రా యూనివర్సిటీలోనే 15 వేలమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మన రాష్ట్రంలోనే అతి ప్రాచీనమైన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో అధ్యాపక విద్యార్థుల నిష్పత్తి 1:70గా ఉన్నది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ప్రతి మూడు ఆధ్యాపక పోస్టులలో రెండు ఖాళీగా ఉన్నాయి. ఇంతకంటే తక్కువగా రాష్ట్రస్థాయి యూనివర్సిటీలో అధ్యాపక ఉద్యోగాల పరిస్థితి ఉంది. సుమారుగా గత 25 సంవత్సరాలుగా యూనివర్సిటీలలో అధ్యాపక నియామకాలు జరగలేదు. ప్రస్తుత విశ్వవిద్యాలయంలో ఉన్న కొద్ది మంది రెగ్యులర్ అధ్యాపకులు యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ పదవులలో ఉండటంతో పని భారం అంత కాంట్రాక్ట్ అధ్యాపకులపై పడినప్పటికీ రెగ్యులర్ అవుతుంది అన్న అత్మవిశ్వాసంతో పీహెచ్‌డీ,యూజీసీ నెట్‌సెట్ పరిశోధన పత్రాలు అకాడమీ పుస్తకాలు కలిగి ఉండి కూడా ప్రతి కాంట్రాక్ట్ అధ్యాపకుడు విశ్వవిద్యాలయాలలో కట్టు బానిసలుగా పనిచేస్తున్నారు. ప్రస్తుత రాష్ట్ర ఉన్నత విద్యా మండలి యూనివర్సిటీలో గత 15-20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రతగాని రెగ్యులైజేషన్ కానీ చేయకుండా మరల 3,200 ఉద్యోగాలకు నియామక ప్రకటనలు జారీ చేసింది. గత ప్రభుత్వాలు ఏ రకంగా అయితే కాంట్రాక్ట్ అధ్యాపకులను నిర్లక్ష్యంచేసి నోటిఫికేషన్లు జారీ చేసిందో అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వము కూడా కాంట్రాక్ట్ అధ్యాపకులకు అన్యాయం చేయడమే అవుతుంది.

యూనివర్సిటీ యాజమాన్యాల స్పందన

యూనివర్సిటీ యాజమాన్యాలు ఎలా పనిచేస్తున్నాయి అంటే రెగ్యులర్ అధ్యాపకులకు వయోపరిమితిని 62 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 39 సి 29.07.2023న జారీచేస్తే 24 గంటలు గడవకముందే రాష్ట్రంలో కొన్ని యూనివర్సిటీలు ఆ జీవోను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో ఆమోదించి అమలులోనికి తెచ్చారు. గత ప్రభుత్వ 60సంవత్సరాలుగా ఉన్న పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలుగా పెంచితే ప్రస్తుత వయసులో ఉన్నవారు కాంట్రాక్ట్ ఉద్యోగులుగానో లేదా నిరుద్యోగులుగాను ఉండిపోతున్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాలు జరిగిన తర్వాత వారికి ఇచ్చే జీత భత్యాలలోనూ, సర్వీస్‌లోనూ నిరంతరాయంగా 90 రోజులు సేవలు దాటకుండా 91వ రోజును కాంట్రాక్ట్ అధ్యాపకుడు కాలేజీకి హాజరైనప్పటికీ

బ్రేక్‌చూపిస్తూ ద ఎంప్లాయి స్టేట్ ఇన్సూరెన్స్ చట్టం 1948 ప్రకారం సంస్థ యాజమాన్యం నుండి, ప్రభుత్వం నుండి వచ్చే సదుపాయాలైన ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్ హక్కులను నిరాకరిస్తున్నారు. ఈ విధముగా ప్రతి 90 రోజులకు ఒక బ్రేకులు చూపిస్తున్నారు. కొన్ని విశ్వవిద్యాలయాలు అయితే సంవత్సర కాలంలో కేవలం 10 నెలలు మాత్రమే జీతభత్యాలు చెల్లిస్తున్నారు కానీ కాంట్రాక్టు లేబర్ (రెగ్యులేషన్ అండ్ అకారిషన్) చట్టం 1970 ప్రకారం ప్రైవేటు సంస్థలు కానీ ప్రభుత్వ సంస్థలు కానీ ఉద్దేశపూర్వకముగా కాంట్రాక్టు ఉద్యోగుల హక్కులను వారికి తెలియకుండా కానీ తెలిసినప్పటికి కానీ నిరాకరిస్తే అది నేరం అవుతుందని తెలియజేస్తుంది కానీ ఇక్కడ ఆ నేరాన్ని ప్రభుత్వాలే యదేచ్ఛగా ఉద్దేశపూర్వకంగా కాంట్రాస్ట్ అధ్యాపకుల హక్కులను కాలరాస్తు శ్రమ దోపిడీ చేస్తున్నాయి. అదేవిధంగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటూ బానిసలాగా బ్రతుకుతున్న కాంట్రాక్టు అధ్యాపకులకు కనీస వేతనం 35 వేల రూపాయలు ఇవ్వాలి అని తదుపరి వారి ఉద్యోగ నిర్వహణను బట్టి సంవత్సరానికి వెయ్యి పెంచుతూ అత్యధికంగా 57 వేల రూపాయలకు మించరాదు అంటూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 110 తేదీ 6.7.2022న విడుదల చేస్తే రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాలు ఇప్పటి వరకు అమలు చేయలేదు. అమలు చేసిన ఐదు విశ్వవిద్యాలయాలకు జీవో నెంబర్ 110 ఒక్కొక్క విశ్వవిద్యాలయానికి ఒక్కొక్క రకంగా కాంట్రాక్టు అధ్యాపకులు జీతాలను ఎలా తగ్గించాలో పోటీపడినట్లు కనిపిస్తుంది వాస్తవానికి యూజీసీ నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ అధ్యాపకులకు ప్రతి సంవత్సరం వారి నిర్వహణను సమీక్షించి మరలా వారిని కొనసాగించినట్లయితే వారికి రెగ్యులర్ అధ్యాపకులు మాదిరిగానే యుజిసి పే స్కేల్స్ ఇవ్వవలెను. నిర్వహణ సమీక్షలు ప్రతి సంవత్సరం చేస్తున్నారు కానీ జీతం మాత్రం పెంచడం లేదు. సమాన పనికి సమాన వేతనం అనేటువంటి రాజ్యాంగ సూత్రాన్ని అమలు చేయుట లేదు. యూనివర్సిటీలకు అనుబంధంగా పనిచేస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థలలో డిగ్రీ, పీజీ బోధించే అధ్యాపకులకు పీహెచ్‌డీ అర్హత కలిగి రెండు సంవత్సరాల టీచింగ్ అనుభవం ఉంటే పరిశోధన గైడెన్స్ ఇచ్చి పరిశోధకులను కేటాయిస్తున్నారు. అనుబంధ ప్రైవేట్ కళాశాలలో పనిచేసే అధ్యాపకుల సర్వీసులు రాటిఫికేషన్ అయినవి కాబట్టి వీరు నేరుగా అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు అర్హులుగా చేస్తున్నారు. నిజానికి ప్రైవేటు కాలేజీలలో అధ్యాపకుల వాస్తవ పరిస్థితి, బూటకపు పరిస్థితి ప్రతి సామాన్య ప్రజానీకానికి తెలిసినదే. యూనివర్సిటీలో పనిచేసే కాంట్రాక్ట్ అధ్యాపకులు యూజీసీ నియమ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అకాడమిక్ పరిశోధనలలో ఎదగటానికి అవకాశం లేకుండా రీసెర్చ్ గైడెన్సు ఇప్పటివరకు ఇవ్వలేదు. వీరి సర్వీసులు కాంట్రాక్టు సర్వీసులు కాబట్టి వీరు నేరుగా అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హులు కారు అంటూ ఎదుగుదలను బలవంతంగా అడ్డుకుంటున్నారు.ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను వారి వారి విద్యార్హతలు, అనుభవం ఆధారంగా ఎంతమందిని వీలైతే అంతమందిని రెగ్యులర్ చేస్తాము అని ఎన్నికలలో నవరత్నాలలో ఒక రత్నంగా వాగ్దానం చేసారు. మా సర్వీసులు రెగ్యులర్ అవ్వాలా అని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మరి ముఖ్యంగా యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు అనుకున్నట్లుగా కాంట్రాక్టు సర్వీస్‌లో రెగ్యులర్ అవుతాయని నమ్మారు. గత ప్రభుత్వాల పాలనలో యూనివర్సిటీ కాంటాక్ట్ అధ్యాపకులకు జీవో నెంబర్ 24ను 2019లో ఇవ్వడం అది అమలు కాకపోవడంతో యూనివర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలకు దిగి ప్రభుత్వంపై వ్యతిరేకతను తెలియజేశారు. అదే ఆవేశంతో సర్వీస్ రెగ్యులర్ అవుతాయని ప్రత్యాయంవైపు ఆలోచించారు. ప్రస్తుత ప్రభుత్వం జీవో నెంబర్ 40ను 2021లో తీసుకురావటం జరిగింది అది కూడా అమలకు నోచుకోలేదు.

డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, ఫోన్: 9492704401
డాక్టర్ కోడి అర్జునుడు, ఫోన్: 9490399779

కులగణనతో విప్లవాత్మక మార్పు

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే... దేశవ్యాప్తంగా అమలు
- పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో చిన్న పరిశ్రమలపై దాడి
- మోదీ బీసీ ప్రస్తావన తేవడం మానేశారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

సత్నా (ఎంపీ): కుల గణన అనేది ప్రజల జీవితాలను మార్చే ఒక విప్లవాత్మక చర్య అని కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మధ్యప్రదేశ్‌తో పాటు జాతీయ స్థాయిలో కులగణన నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మధ్యప్రదేశ్‌లోని సాత్నాలో జరిగిన బహిరంగసభను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగం పెరగడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి రాగానే ఓబీసీ (ఇతర వెనుకబడిన తరగతులు)ల కచ్చిత సంఖ్యను నిర్ధారించేందుకు కులగణన చేపడతామని హామీ ఇచ్చారు. ఇది ఎక్స్‌రే లాంటిదని... ఓబీసీల అందరి వివరాలు తెలుస్తాయని... దాని ప్రకారం వారి సంక్షేమం కోసం విధానాలు రూపొందించబడతాయని రాహుల్ తెలిపారు. ఇక కేంద్రంలో అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో కుల గణనను కూడా కాంగ్రెస్ చేపడుతుందని, ఈ కసరత్తు ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తెస్తుందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ తాను ఓబీసీ అని చెబుతుంటారని, అయితే దేశంలో కుల గణన నిర్వహించాలన్న అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తిన వెంటనే దాని గురించి మాట్లాడటం మానేశారని రాహుల్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌ను నడుపుతున్న 53 మంది ఐఏఎస్ అధికారుల్లో ఒక్కరు మాత్రమే ఓబీసీ అని చెప్పారు. దీని అర్థం రాష్ట్ర మొత్తం బడ్జెట్ రూ. 100 అయితే, ఓబీసీ అధికారికి కేవలం 33 పైసాలు లేదా .03 శాతంపై నియంత్రణ ఉంటుందని ఆయన చమత్కరించారు. గత 18 ఏళ్లలో మధ్యప్రదేశ్‌లో అప్పుల బాధతో 18 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని రాహుల్ తెలిపారు. దేశంలో నిరుద్యోగం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ...

పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను(జీఎస్టీ) వల్ల చిన్న-మధ్యతరహా వ్యాపారాలు మూతబడటమే కాకుండా ఆయా వ్యాపారాలు రోడ్డున పడ్డారని... ఇది దేశంలో నిరుద్యోగం పెరగడానికి దారితీసిందన్నారు. 'భారత్ జోడో యాత్ర'లో తన అనుభవాన్ని ఉటంకిస్తూ...ఈ దేశ జనాభాలో 50 శాతం మంది ఓబీసీలేనని రాహుల్ పేర్కొన్నారు. జనాభాలో వారి నిష్పత్తి ప్రకారం ప్రభుత్వంలో ఓబీసీలు, దళితులు ,గిరిజనుల భాగస్వామ్యం ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని... ప్రజలు చెల్లించిన సొమ్మును తీసి 16 కంపెనీలకు ఇస్తున్నారన్నారు. విపత్తుల తర్వాత ఓబీసీ, దళితులు, గిరిజన వర్గాలకు చెందిన రైతులు ఈ పథకం కింద సహాయం అందించాలని కోరినప్పుడు ఈ కంపెనీలు ఎటువంటి విపత్తు జరగలేదని చెబుతూ నిరాకరిస్తున్నాయని రాహుల్ ఆరోపించారు. ఈ 16 బీమా కంపెనీల్లో దళితులు, ఓబీసీలు, గిరిజన వర్గాల వారు ఎవరూ పనిచేయడం లేదని ఆయన చెప్పారు. 'ఓబీసీల సరైన జనాభా సంఖ్యను తెలుసుకోవాలని నరేంద్ర మోదీ కోరుకోవడం లేదు' అని రాహుల్ అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన జరిగేలా చూస్తానని చెప్పారు. నిరుద్యోగం విషయంలో బీజేపీపై రాహుల్ విరుచుకుపడ్డారు. భారత్ జోడో యాత్రలో డిగ్రీలు చదివి ఉద్యోగాలు లేని యువకులను పెద్ద సంఖ్యలో కలిశానని చెప్పారు. 'ఇది ఈ రాష్ట్రం, దేశంలో ఉన్న వాస్తవం. సమర్థులు, శక్తి సామర్థ్యాలు కలిగిన ఎంతోమంది యువకులు దేశాన్ని బలోపేతం చేయాలనుకుంటున్నారు కానీ మోదీ ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధి పొందలేకపోతున్నారని అన్నారు. పెద్ద పారిశ్రామిక వేత్తలు ఉపాధిని కల్పించడం లేదని, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారాలే ఉద్యోగాలను సృష్టిస్తాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి యూనిట్లు యువతకు ఉద్యోగాలు ఇచ్చేవని కాంగ్రెస్ నేత తెలిపారు. కానీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలపై దాడి చేశాయని దుయ్యబట్టారు. తొలిసారిగా ట్రాక్టర్లు, ఇతర పరికరాలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడంతో రైతులు పన్నులు చెల్లించాల్సి వస్తోందన్నారు. మధ్యప్రదేశ్‌లో 18 ఏళ్లలో 18,000 మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారని, రాష్ట్రంలో బీజేపీ పాలనను ప్రస్తావిస్తూ రాహుల్ వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వం తమ పంటలకు సరైన ధరలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి భూములు అమ్ముకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు బీజేపీ డబ్బులు ఇస్తుంది. కాబట్టి మీ జీఎస్టీ పెద్ద నగరాల్లో, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు పెట్టే అదానీకి వెళ్తుంది' అని రాహుల్ పేర్కొన్నారు. 2021లో మధ్యప్రదేశ్‌లో 670 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో 70 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం రైతులకు అనుకూలంగా పని చేయడం వల్లనే ఇంత తేడా వచ్చిందన్నారు.

ప్రజలను బెదిరిస్తే బుల్డోజర్ తీస్తాం

కాంగ్రెస్‌కు చౌహాన్ హెచ్చరిక

అనుప్పూర్: ఓటర్లను బెదిరిస్తే మామ బుల్డోజర్ సిద్ధంగా ఉంటుందని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు. అనుప్పూర్ జిల్లా బిజూరిలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో సీఎం ఈ మేరకు బెదిరింపులకు దిగారు. ఎంపీ ప్రజలు శివరాజ్ సింగ్‌ను 'మామ' అని ఆప్యాయంగా సంబోధిస్తుంటారు. ఓట్ల కోసం ప్రజలను కాంగ్రెస్ అభ్యర్థులు బెదిరిస్తున్నట్టు తనకు తెలిసిందని, ఈ విషయంలో తాను చాలా స్పష్టంగా చెబుతున్నానని, ప్రజలపై వేలెత్తి చూపినా, కన్నెర్ర చేసినా మామ బుల్డోజర్ సిద్ధంగా ఉంటుందని కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. కాంగ్రెస్ దౌర్జన్యాలను సహించేది లేదని, నేలమట్టం చేస్తామని బెదిరించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత 15 నెలల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అన్ని అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేసిందని ఆయన విమర్శించారు. తాను ప్రవేశపెట్టిన సంబల్ యోజనకు గండికొట్టి పిల్లల నుంచి సైకిళ్లు లాక్కున్నారని, తీర్థయాత్రలు ఆపేస్తే తాను తిరిగి ప్రారంభించానని చెప్పారు. కాగా, 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. 230 అసెంబ్లీ స్థానాలున్న మధ్యప్రదేశ్ ఎన్నికల పోలింగ్ నవంబర్ 17న ఒకే విడతలో జరుగనున్నాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెలువడతాయి.

సర్దార్‌పురాలో గెహ్లాత్ అజేయుడు

- ఆరోసారి ఎన్నికవడం ఖాయమంటున్న మద్దతుదారులు
- బీజేపీ కార్యకర్తల ఓటు కూడా ఆయనకేనని వెల్లడి

జోధ్‌పూర్: రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ఆరోసారి సర్దార్‌పురా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందనున్నారా? అంటే అక్కడి ప్రజలు ఎమ్మెల్యేగా కాదు... ముఖ్యమంత్రిగా గెలవబోతున్నారంటూ తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారు. 'ఇక్కడ కాంగ్రెస్ మాత్రమే కాదు...బీజేపీ కార్యకర్తలు కూడా గెహ్లాట్‌కు ఓటు వేస్తారు' సర్దార్‌పురా నియోజకవర్గానికి చెందిన ఓటరు హర్దేవ్ రామ్ బిష్ణోయ్ వెల్లడించారు. సర్దార్‌పురాలో కేవలం ఎమ్మెల్యేకి కాదు... మేము ముఖ్యమంత్రికి ఓటు వేస్తామన్నారు. రాబోయే రాష్ట్ర ఎన్నికలలో గెహ్లాత్ ఆరోసారి భారీ మెజారిటీతో ఎన్నికవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. సర్దార్‌పురాలో గెహ్లాత్ అజేయుడు అనే నమ్మకాన్ని బిష్ణోయ్ ఒక్కడే వ్యక్తపర్చలేదు. అతను కూర్చున్న మహామందిర్ ప్రాంతంలోని ఇరుకైన వీధుల్లో ఉండే వారంతా ఆయన మద్దతుదారులే. బిష్ణోయ్ స్నేహితుల బృందంతో మాట్లాడుతూ దొరికిపోయాడు. 'హతై' ఇది పొరుగున ఉండే వారితో సాయంత్రం వేళ చర్చలు, పేకాట లు జరిగే రోజువారీ చర్చావేదిక. మసకబారిన వెలుతురులో కూర్చున్న జన సమూహం... గెహ్లాత్ విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఇందులో మరో వ్యక్తి సురేంద్ర భాటీ... జోధ్‌పూర్‌లో గెహ్లాత్ చేసిన అభివృద్ధి పనులను, అమలవుతున్న ప్రభుత్వ పథకాలను ప్రశంసించారు. గెహ్లాత్ కృషితో గడచిన కాలంలో జోధ్‌పూర్‌కు ఎయిమ్స్, ఐఐటీ, నిఫ్ట్ న్యాయ విశ్వవిద్యాలయం వంటి అత్యుత్తమ విద్యాసంస్థలు వచ్చాయని, మెరుగైన రోడ్లు, మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాయని భాటి వివరించారు. అశోక్ గెహ్లాత్ రాష్ట్ర రాజకీయాలకు మారడానికి ముందు 1980-1998 మధ్య ఐదు సార్లు జోధ్‌పూర్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిథ్యం వహించారు. ఆ తర్వాత సర్దార్‌పురా నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. మూడుసార్లు రాజస్థాన్ ముఖ్యమంత్రి అయ్యారు. కాగా గత రెండు లోక్‌సభ ఎన్నికలలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ జోధ్‌పూర్ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయితే సర్దార్‌పూర్ అసెంబ్లీ విషయానికి వస్తే... గెహ్లాత్ ప్రభావం స్పష్టంగా ఉంది. 2008 నుంచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన మెజారిటీ పెరుగుతూ వస్తోంది. 2008లో ఆయన తన సమీప ప్రత్యర్థి అయిన బీజేపీ అభ్యర్థిని 15,000 పైగా ఓట్లతో ఓడించారు. అది 2013లో 18,478 ఓట్లకు పెరిగింది. 2018లో 45,597 ఓట్లతో చరిత్రాత్మక విజయం సాధించారు. సర్దార్‌పురాలో, రాజకీయ చర్చలు గెహ్లాట్‌కు, ఆయన సంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం చేయబడ్డాయి. అన్నింటికంటే మించి సర్దార్‌పుర ప్రజలు రాష్ట్రానికి ముఖ్యమంత్రిని ఇచ్చినందుకు గర్వపడుతున్నారు. గెహ్లాత్ సీఎంగా ఉండడంపై జగదీష్ కుమార్‌ను పీటీఐ ప్రశ్నించగా... ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని... రాష్ట్రమంతా ఆయనే చూసుకోవాలన్నారు. నియోజకవర్గంలో అందుబాటులో లేకపోయినా ఏ పని కూడా ఆగదు... ముఖ్యమంత్రి తన నియోజకవర్గ సమస్యలను చూసుకుంటారని తెలిపారు. అయితే బీజేపీ నేతలు మాత్రం ఈసారి గెహ్లాట్ గట్టి పోటీ ఉండనుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో రోడ్లు, మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా ఉందని... బీజేపీ అభ్యర్థి మహేంద్ర సింగ్ రాథోడ్ గెలుస్తారని ఆ పార్టీ మద్దతుదారులు తెలిపారు. మహేంద్ర సింగ్ రాథోడ్ జోధ్‌పూర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా పని చేస్తూ తన సత్తాను నిరూపించుకున్నారని బీజేపీ కౌన్సిలర్ అశోక్ ఖించి అన్నారు. అయితే సర్దార్‌పురాలో ఎవరు గెలుస్తారని అడగ్గా... అశోక్ గెహ్లాత్ లేదా మహేంద్ర సింగ్ అని నవ్వుతూ బదులిచ్చారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 25న జరగనుండగా, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపడతారు.

ఉద్యోగుల ఖాతాల్లో పీఎఫ్ వడ్డీ

న్యూఢిల్లీ: ఉద్యోగ భవిష్యనిధి సంస్థ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పీఎఫ్ నిల్వలపై వడ్డీ మొత్తాలను పీఎఫ్ ఖాతాదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటికే కొందరి ఖాతాల్లో వడ్డీ మొత్తాలు జమయ్యాయి. కొంతమంది ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఖాతాల్లో కనిపించడానికి కొంత సమయం పడుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈపీఎఫ్‌ఓ ఓ ఎక్స్ యూజర్‌కు ఇచ్చిన సమాధానంలో పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ నిల్వలపై 8.15 శాతం వడ్డీ చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో ఈపీఎఫ్‌ఓ వడ్డీని ఆయా ఖాతాల్లో జమ చేస్తోంది. ఈపీఎఫ్ వడ్డీ మొత్తం జమ అయ్యిందో లేదో ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవడానికి అవకాశం ఉంది. ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్‌లో సర్వీసెస్ విభాగంలోకి వెళ్లి 'ఫర్ ఎంప్లాయీస్' సెక్షన్... అందులో మెంబర్ పాస్‌బుక్ ఎంచుకోవాలి. తర్వాత లాగిన్ పేజీలో యూఏఎన్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వడం ద్వారా ఈపీఎఫ్ బ్యాలెన్స్‌ను చెక్ చేసుకోవచ్చు. కేంద్రం తీసుకొచ్చిన ఉమాంగ్ యాప్ ద్వారా కూడా పీఎఫ్ వడ్డీ మొత్తం జమ అయ్యిందో లేదో చూసుకోవచ్చు. ఉమాంగ్ యాప్‌లో ఈపీఎఫ్ సెక్షన్‌లోకి వెళ్లి.. వ్యూ పాస్‌బుక్ ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత యూఏఎన్ నంబర్ ఎంటర్ చేసి గెట్ ఓటీపీ ఆప్షన్ ఎంచుకోవాలి. తర్వాత మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయాలి. అప్పుడు ఈపీఎఫ్ ఖాతా వివరాలు కనిపిస్తాయి.

మోస్తరు వర్షాలతో దిల్లీ వాసులకు ఊరట

న్యూఢిల్లీ: తీవ్ర వాయు కాలుష్యంతో అల్లాడిపోతున్న దేశ రాజధాని దిల్లీవాసులకు శుక్రవారం కొంతమేర ఊరట లభించింది. గురువారం అర్ధరాత్రి నుంచి కురిసిన ఓ మోస్తరు వర్షంతో శుక్రవారం ఉదయం వాయు నాణ్యత స్వల్పంగా మెరుగుపడింది. వర్షాలు పడే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేయడంతో దిల్లీ ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. పశ్చిమ గాలులు దిశ మార్చుకోవడంతో వాయువ్య భారతంలో కొన్నిచోట్ల వర్షాలు కురిశాయి. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోనూ నిన్న అర్ధరాత్రి తర్వాత నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో దిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ 408కి తగ్గింది. నిన్న సాయంత్రం ఇది 437గా నమోదైంది.శనివారం కూడా దిల్లీ - ఎన్‌సీఆర్ ప్రాంతంలో వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో దీపావళి (నవంబరు 12) నాటికి దిల్లీలో కాలుష్యం మరింత తగ్గే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. దిల్లీలో వారం రోజులుగా వాయు నాణ్యత విపరీతంగా క్షీణించి ప్రమాదకర స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే. దిల్లీ అంతటా విషపూరిత పొగమంచు కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలు తగలబెట్టడమే దిల్లీలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టిన దిల్లీ ప్రభుత్వం... ఈ నెల 20న కృత్రిమ వర్షం కురిపించాలని యోచించింది. ఐఐటీ కాన్పూర్‌తో కలిసి మేఘమథనం జరిపే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. ఈలోగానే వర్షాలు కురుస్తుండటం ప్రభుత్వానికి కాస్త ఉపశమనం కల్పించింది.

పూరీ ఆలయంలో తొక్కిసలాట

కటక్: ఒడిశా లోని పూరీ జగన్నాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 10 మంది భక్తులు గాయపడ్డారు. క్షతగాత్రులను పూరీ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒడియా పంచాంగం ప్రకారం... గత పౌర్ణమి నుంచి కార్తీకమాసం ప్రారంభమైంది.

కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు పూరీ జగన్నాథుని దర్శనానికి తరలివచ్చారు. ఈ క్రమంలోనే ఉదయం 'మంగళ ఆలటి' నిర్వహించిన తర్వాత ఒక్కసారిగా భక్తులు లోపలికి ప్రవేశించేందుకు యత్నించారు. దీంతో ఆలయం మెట్లపై తొక్కిసలాట జరిగింది.

సుప్రీంకోర్టులో కెఫే ప్రారంభించిన సీజేఐ

న్యూఢిల్లీ: మానసిక, శారీరక వైకల్యంతో సంబంధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా సుప్రీంకోర్టు ప్రత్యేక చొరవ చూపింది. ఇందులో భాగంగానే సుప్రీంకోర్టు ప్రాంగణంలో దివ్యాంగులతో నడిచే కెఫే ఏర్పాటైంది. ఈ 'మిట్టీ కేఫే'ను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ శుక్రవారం ప్రారంభించారు. ఉదయం రోజువారీ కార్యకలాపాలకు ముందు కోర్టు ప్రాంగణంలో సీజేఐ...ఇతర న్యాయమూర్తులతో కలిసి ఈ కేఫ్‌టేరియాను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ 'ఈ కెఫేను నడిపేవారంతా ప్రత్యేక అవసరాలున్నవారే. ఇప్పటికే దేశవ్యాప్తంగా 'మిట్టీ కెఫే' 38 కేఫ్‌టేరియాలు నిర్వహిస్తోంది. కోవిడ్ మహమ్మారి సమయంలో వారు 60 లక్షల భోజనాలు అందించారు. ఇప్పుడు సుప్రీంకోర్టులో కెఫే ప్రారంభమవడం ఆనందంగా ఉంది. ఈ ప్రత్యేక వెంచర్‌కు బార్ సభ్యులంతా మద్దతుగా ఉంటారని ఆశిస్తున్నా' అని తెలిపారు. ఇప్పటికే సుప్రీంకోర్టుకు వచ్చే న్యాయవాదులు, వ్యాజ్యదారుల కోసం న్యాయస్థానం ప్రాంగణంలో అనేక క్యాంటీన్లు, కేఫ్‌టేరియాలు ఉండగా... వీటికి అదనంగా ఈ మిట్టీ కెఫేను నిర్వహించనున్నారు. మరోవైపు దివ్యాంగ న్యాయవాదులు, వ్యాజ్యదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేలా దేశవ్యాప్తంగా కోర్టుల్లో వారికి అవసరమైన సౌలభ్యాలు కల్పించాలని సీజేఐ ఇప్పటికే చాలాసార్లు పిలుపునిచ్చారు. జస్టిస్ చంద్రచూడ్‌కు ఇద్దరు కుమారులు కాగా... మరో ఇద్దరు దివ్యాంగ అమ్మాయిలను దత్తత తీసుకున్నారు. ఇక రోజంతా కేసుల వాదనతో బిజీ బిజీగా గడిపే సీజేఐ జస్టిస్ చంద్రచూడ్...ఇటీవల సుప్రీంకోర్టు పరిసరాల్లో కలియతిరగడం తెలిసిందే.

11.5 కోట్ల పాన్ కార్డులు డీయాక్టివ్

న్యూఢిల్లీ: నిర్దేశిత గడువులోగా ఆధార్ కార్డుతో అనుసంధానం చేయని కారణంగా దేశవ్యాప్తంగా 11.5 కోట్ల పాన్ కార్డులు డీయాక్టివ్ అయ్యాయి. అనుసంధానానికి ఇచ్చిన గడువు ఈ ఏడాది జూన్ 30తో ముగియడంతో ఈ కార్డులు డీయాక్టివ్ చేసినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 70.24 కోట్ల పాన్ కార్డుదారులు ఉండగా... అందులో 57.25 కోట్ల మంది ఆధార్‌తో తమ పాన్‌ను అనుసంధానం చేసుకున్నారని సీబీడీటీ తెలిపింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్‌టీఐ కార్యకర్త శేఖర్ గౌర్ దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తుకు సీబీడీటీ ఈ మేరకు సమాధానం ఇచ్చింది. 2017 జులై 1 కంటే ముందు జారీ చేసిన పాన్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం అందరూ ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం దఫదఫాలుగా కేంద్రం గడువు పొడిగిస్తూ వచ్చింది. తొలుత మార్చి 30 వరకు అనుసంధానానికి అవకాశం ఇవ్వగా... చివరి అవకాశంగా జూన్ 30 వరకు గడువు ఇచ్చింది. డీయాక్టివేట్ అయిన కార్డులను పునరుద్ధరించడానికి సీబీడీటీ అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం రూ.1000 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైతే 2023 జూన్ 30 గడువు లోగా అనుసంధానం చేయలేదో... వారు పెనాల్టీ చెల్లించి తమ పాన్ కార్డును తిరిగి పునరుద్ధరించుకోవచ్చు. పాన్ కార్డు పునరుద్ధరణకు 30 రోజుల సమయం పడుతుంది. ఈ లోగా నిరుపయోగంగా మారిన కారణంగా పాన్ కార్డును లావాదేవీలకు వినియోగించలేరు. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చి 28న కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. రూ.1000 జరిమానా చెల్లించి ఆధార్ అధికారులకు ఆ విషయం వెల్లడిస్తే 30 రోజుల తర్వాత పాన్ కార్డును పునరుద్ధరించుకోవచ్చని పేర్కొంది.

ఆ 25 కోట్లు నకిలీవే: పోలీసులు

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరు శివారులో చెత్త ఏరుకునే వ్యక్తికి ఓ చెత్తకుప్పలో రూ.25 కోట్ల విలువైన అమెరికన్ డాలర్లు లభ్యమయ్యాయి. వాటిని నిశితంగా పరిశీలించగా ఆ నోట్లు నకిలీవిగా తేలినట్లు పోలీసులు వెల్లడించారు. వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పంపగా... ఆ నోట్లు ఫొటోకాపీ లేదా ప్రింట్ తీసినవిగా అధికారులు తెలిపారన్నారు. సల్మాన్ షేక్ అనే వ్యక్తి ఇటీవల బెంగళూరు శివారులో చెత్త ఏరుకుంటుండగా అమెరికన్ డాలర్ల కట్టలు 23 కనిపించాయి. అతడి యజమాని, అక్కడి నుంచి ఓ సామాజిక కార్యకర్త ద్వారా ఈ వ్యవహారం బెంగళూరు పోలీసుల వద్దకు చేరింది. ఈ మొత్తం విలువ రూ.25 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఈ నోట్లపై కొన్ని రకాల రసాయనాలు పూసినట్లు గుర్తించారు. బ్లాక్ డాలర్ స్కామ్‌కు పాల్పడుతున్న ముఠాకి చెందిన వారు ఈ కరెన్సీ నోట్లను అక్కడ వదిలేసి ఉంటారని అనుమానించారు. డబ్బుతోపాటు ఐరాస ముద్రతో కూడిన ఓ లేఖ కూడా షేక్‌కు లభించింది. 'దక్షిణ సూడాన్‌లోని ఐరాస శాంతి పరిరక్షక దళాలకు సాయం కోసం ఐరాస భద్రతామండలి ఆమోదంతో ఎకనామిక్, ఫైనాన్షియల్ కమిటీ ప్రకటించిన ప్రత్యేక నిధి' అని రాసి ఉంది. ఈ క్రమంలోనే అవి నిజమైన డాలర్లేనా? నకిలీవా? అని గుర్తించేందుకు వాటిని ఆర్‌బీఐకి పంపగా... చివరకు నకిలీవిగా తేలాయి. మరిన్ని వివరాల కోసం వాటిని చెన్నైలోని ఓ ప్రైవేటు బ్యాంకుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

70 పని గంటలకు తివారీ మద్దతు



న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తాజాగా స్పందించారు. నారాయణమూర్తి అభిప్రాయంపై ఇంత చర్చ ఎందుకో తనకు అర్థం కావడం లేదని తివారీ అన్నారు. నారాయణమూర్తి చెప్పినదాంట్లో తప్పేముందని ప్రశ్నించారు. కొంతమంది ప్రజాప్రతినిధులు వారంలో రోజుకు 12 నుంచి 15 గంటలు పనిచేస్తుంటారని, చివరగా తాను కూడా ఆదివారం సెలవు ఎప్పుడు తీసుకున్నానో గుర్తులేదన్నారు. ఎన్నికైనా, కాకపోయినా నియోజకవర్గంలో ఆదివారం పనిచేస్తామని, భారత్ నిజంగా గొప్ప శక్తిగా ఎదగాలంటే... ఒకటి లేక రెండు తరాలు 70 గంటలపాటు పనిచేయడాన్ని నియమంగా మార్చుకోవాలని తివారీ అభిప్రాయపడ్డారు. ఉద్యోగులకు సరిపడా ఉపాధి ఉంటే... వారానికి 70 గంటల పని-ఒకరోజు సెలవు, ఏడాదికి 15 రోజులు వెకేషన్‌ను నిబంధనగా చేసుకోవాలని తివారీ అన్నారు. ఇంతకుముందు ఓ కార్యక్రమంలో నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉత్పాదకత చాలా తక్కువని, మనం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే యువత దేశం కోసం వారానికి 70 గంటలు పనిచేయాలని అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జర్మన్లు, జపనీయులు ఇదే పనిచేశారన్నారు.

ఉగ్రదాడి హెచ్చరికతో రామాలయానికి భద్రత



న్యూఢిల్లీ: అయోధ్యలోని రామాలయం చుట్టూ భద్రతను సాయుధ బలగాలు మరింత కట్టుదిట్టం చేశాయి. ఉగ్రదాడి ముప్పు ఉండవచ్చనే సమాచారంతో సాయుధ బలగాలు అప్రమత్తమయ్యాయి. నిర్మాణంలో ఉన్న భవ్య రామాలయంపై పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న అల్‌ఖైదా, లష్కరే తొయిబా ఉగ్రవాదసంస్థలు దాడి చేసే అవకాశం ఉందని భద్రతా సంస్థలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన అడ్వయిజరీని త్వరలో విడుదల చేయనున్నారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయోధ్య రామమందిర ప్రారంభ మహోత్సవానికి హాజరు కావాలని ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ట్రస్టు సభ్యులు ఆహ్వానం అందించారు. ట్రస్టు సభ్యుల ఆహ్వానాన్ని అంగీకరించిన మోదీ 2024 జనవరి 22న రామాలయంలో జరిదే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరవుతారని తెలుస్తోంది. జనవరి 14 మకర సంక్రాంతి తర్వాత రామ్‌లల్లా ప్రతిష్ఠాపన ప్రక్రియ ప్రారంభించి 10 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆలయ ట్రస్టు నిర్ణయించింది. ఆలయ గ్రౌండ్ ఫ్లోర్ పనులు డిసెంబర్ చివరికల్లా పూర్తికానున్నాయి. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి 2020 ఆగస్టు 5న మోదీ శంకుస్థాపన చేసిన విషయం విదితమే.

ఎన్నికల మేనిఫెస్టోలో సామాజిక పింఛనుదారుల సమస్యలు

- రాజకీయ పార్టీలకు రామకృష్ణ విజ్ఞప్తి
- ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరమన్న ముప్పాళ్ల
- 11 మందితో కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-విజయవాడ: సమాజంలో వెనుకబాటుకు గురవతున్న వయోవృద్ధులు, విభిన్నప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్లు, ఒంటరి మహిళలు, వితంతువుల సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. సీపీఐ, సామాజిక పింఛన్‌దారుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సదస్సులో రామకృష్ణ మాట్లాడారు. స్థానిక హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సదస్సు జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో 12 శాతం మంది, ఆంధ్రప్రదేశ్‌లో 70 లక్షల మంది వృద్ధులు ఉన్నారని చెప్పారు. వారికి వైసీపీ ప్రభుత్వం రూ.2,750 మాత్రమే పింఛను ఇస్తున్నదన్నారు. ఒక వ్యక్తి గౌరవంగా బతకటానికి ఈ డబ్బులు ఏమాత్రం సరిపోవన్నారు. సామాజిక పింఛనుదారుల సమస్యలపై 26 జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని సూచించారు. వృద్ధులకు, వితంతువులకు, చేనేత, గీత, మత్స్య, కళాకారుల, ఒంటరి మహిళలకు నెలకు రూ.6 వేలు, విభిన్న ప్రతిభావంతులకు నెలకు రూ.7 వేలు పింఛను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్సులు, రైళ్లలో వృద్ధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆసుపత్రుల్లో వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను సీపీఐ ఎన్నికల మేనిఫెస్టోలో పెడుతుందని హామీ ఇచ్చారు.

ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం: ముప్పాళ్ల

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక పింఛనుదారుల కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. సమాజంలో కీలక వస్తువుల ఉత్పత్తిలో బాధ్యత వహిస్తున్న చేనేత, గీత, మత్స్య, భవన నిర్మాణ కార్మికులతో పాటు హమాలీలు,ఆటోకార్మికులు, వ్యవసాయ కూలీలు తదితర ఉత్పత్తి శక్తులకు పదవీ విరమణ లేదన్నారు. కాళ్లు, చేతులు పనిచేయక మంచానికి పరిమితమైతే తప్ప వారు శ్రమ చేస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి శ్రామికవర్గం వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవనం సాగేలా చూడవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. వారి సంక్షేమం కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, రాష్ట్రంలో ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ పింఛను ఇవ్వాలన్నారు. 60 ఏళ్లు నిండిన వారికి ప్రత్యేక ఆరోగ్య బీమా, ఉచిత వైద్య సౌకర్యం, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యువకులు, విద్యార్థులు దేశ భవిష్యత్ అయితే వృద్ధులు జాతి సంపద అనే విషయాన్ని మరువకూడదని వక్కాణించారు. ఎవరూ అడగక పోయినా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాలకు రూ.10 వేలు ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. సామాజిక పింఛనుదారుల సమస్యలపై డిసెంబరు మొదటి వారంలో అర్జీలు ఇవ్వాలని సూచించారు. సచివాలయం, మండల, జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక పింఛనుదారుల హక్కుల సాధనకు భవిష్యత్‌తో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర సదస్సు సందర్భంగా 11 మందితో కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక పింఛనుదారుల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి ఉద్యమాన్ని బలోపేదం చేయాలన్నారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ భార్యభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీలు, ఎమ్మెల్యే, మంత్రులు అయితే ఇద్దరికీ పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం... సామాజిక పింఛనుదారులకు భార్య, భర్తలలో ఒకరికే ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు. అర్హులందరికీ పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. విభిన్న ప్రతిభావంతులు శ్రీనివాసరావు, బేబీ తమ సమస్యలను సదస్సు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ వేమూరి బాబూరావు, సైనిక సంక్షేమ శాఖ ప్రతినిధి మంత్రూనాయక్, వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు మహమ్మద్ ఆజం, నామా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ బృందం అభ్యుదయ గీతాలు ఆలపించింది.

రెట్టింపు మెజారిటీతో గెలిచి వస్తా

- ప్రశ్నించే స్వరాన్ని నొక్కేయడమే మోదీ-అదానీ వ్యూహం
- బొగ్గు కుంభకోణం దాచి పెట్టడమే వారి ఉద్దేశం
- కాషాయ పార్టీ... అబద్ధాల కర్మాగారం: మహువా మెయిత్రా

న్యూదిల్లీ: వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి పార్లమెంటుకు తిరిగి వస్తానని టీఎంపీ ఎంపీ మహువా మొయిత్రా ప్రకటించారు. డబ్బుకు ప్రశ్న వ్యవహారంలో ఎంపీ పదవి నుంచి తొలగించాలని ఎథిక్స్ కమిటీ సిఫార్సు చేయడంపై ఆమె స్పందించారు. బహిష్కరణ సిఫార్సును పెద్ద మనుషుల పంచాయతీ (కంగారూ కోర్టు) ముందుగానే నిర్ణయించుకుని ఇచ్చిన తీర్పుగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు దేశానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మరణంతో సమానమని వ్యాఖ్యానించారు. ఈ పరిణామం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. పార్లమెంటు నుంచి తనను బహిష్కరిస్తే వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి తిరిగి లోక్‌సభలో అడుగుపెడతానని, తాజా పరిస్థితులు అందుకు దోహదమవుతాయని అన్నారు. 'ముందు తొలగించండి. ఆ తర్వాత ఆధారాల కోసం అన్వేషించమని సీబీఐకి ఆదేశాలివ్వాల్సిందిగా ప్రభుత్వానికి సూచించండి' అని ఎక్స్ మాధ్యమంగా మహువా వ్యాఖ్యానించారు. ఇది కంగారు కోర్ట్, మంకీ బిజినెస్ అని ఆమె ట్వీట్ చేశారు. మరొక ట్వీట్‌లో వ్యాపారవేత్త గౌతం అదానీని ఉద్దేశిస్తూ 'మిస్టర్ అదానీ... మహువా స్థానం పోయిందని చెప్పుకుంటూ సమయం వృధా చేసుకోవద్దు. పోయేది విఫణిలో మీ స్థానం తప్ప మరేమీ కాదు' అని పేర్కొన్నారు. ముందు చెప్పినట్లు కృష్ణానగర్ నుంచి పోటీ చేసి రెట్టింపు మెజారిటీతో గెలిచి పార్లమెంటుకు తిరిగి వస్తానన్నారు. అదానీ బొగ్గు కుంభకోణం గురించి ఎవరు మాట్లాడితే వారి గొంతు నొక్కేసి కుంభకోణాన్ని దాచాలని కేంద్రం యత్నిస్తోందని, అందుకే తనపై చర్యలకు ప్రధాని మోదీ నుంచి ఒత్తిడి రావడంతోనే ఎథిక్స్ కమిటీ ఈమేరకు సిఫార్సులు చేసిందని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ మహువా మొయిత్రా వెల్లడించారు. అదానీ రూ.13వేల కోట్ల బొగ్గు కుంభకోణం చేశారు. మరో దేశమైతే అక్కడి ప్రభుత్వం కూలిపోయేది కాబట్టి దీనిని సాధ్యమైనంత మేరకు గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. 'మోదీ-అదానీ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. వారిని ప్రశ్నించే వారంతా ఆందోళన చెందాల్సి వస్తోంది. మనం కూడా ఆ కొందరిలో ఉన్నాం. కాబట్టి ప్రశ్నించే స్వరాన్ని నొక్కేయడమో జైలుకు పంపడమే వారి ఉద్దేశం' అని మహువా అన్నారు. కాషాయ పార్టీని అబద్ధాల కర్మాగారంగా అభివర్ణించారు. ప్రతిరోజు ఏదో ఒక నకిలీ వార్తను తెస్తారు. దేశ మీడియా మోదీ, అదానీ అధీనంలో ఉండటమే సమస్య. వచ్చే వార్తలపై అత్యుత్సాహం ప్రదర్శిస్తుంటారు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు నివేదికలోని అంశాలు కమిటీ ఆమోదానికి ముందే మీడియాలో రావడంపై మహువా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్‌కు ఆమె లేఖ రాశారు.

జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటిస్థలం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. గుర్తింపు పొందిన (అక్రిడిటేషన్ కలిగిన) జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం కేటాయిస్తూ శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ విభాగం ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీజేశారు. ఇప్పటికే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన కేబినెట్‌లో ఆమోదముద్ర వేశారు. అర్హతగల జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున స్థలం ఇస్తారు. కనీసం ఐదేళ్లపాటు అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ వర్తిస్తుంది. ఈ మూడు సెంట్ల స్థలాన్ని 60:40 చెల్లింపు పద్ధతిలో కేటాయిస్తారు. ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేయాలి. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తారు. వెబ్‌సైట్‌లో తెరచిన తేదీ నుంచి 45 రోజుల్లోగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నేతృత్వంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు కమిటీలు ఏర్పాటు చేస్తారు. అందులో జర్నలిస్టులకు సభ్యులుగా అవకాశం కల్పిస్తారు. జర్నలిస్టులు పనిచేస్తున్న/ నివసిస్తున్న జిల్లాలు/ మండలాల్లో ఇంటి స్థలాల కేటాయింపులకు ప్రాధాన్యత ఇస్తారు. అన్ని విధాలా అభ్యర్థనల్ని స్వీకరించాక, జిల్లాస్థాయి కమిటీల నేతృత్వంలో జర్నలిస్టుల కోసం ఇంటి స్థలాలకు సరిపోయే భూమిని ప్రాంతాల వారీగా గుర్తిస్తారు.

ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ కస్టడీ పొడిగింపు

న్యూదిల్లీ: దిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్ జ్యుడిషియల్ కస్టడీని నవంబర్ 24 వరకూ స్థానిక కోర్టు శుక్రవారం పొడిగించింది. ఎంపీగా అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లపై సంజయ్ సింగ్ సంతకాలు చేసేందుకు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ అనుమతించారు. దీనితో పాటు పంజాబ్‌లో ఒక కేసుకు సంబంధించి అమృత్‌సర్ కోర్టు నుంచి పీటీ వారెంట్ ఉన్న విషయాన్ని పరిశీలించిన న్యాయమూర్తి పంజాబ్ కోర్టు ముందు సంజయ్‌సింగ్‌ను హాజరుపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. దిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో అక్టోబర్ 4న ఈడీ సంజయ్ సింగ్‌ను గంటల తరబడి ప్రశ్నించి అనంతరం అరెస్టు చేసింది. రద్దయిన ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలులో సంజయ్‌సింగ్ కీలకపాత్ర పోషించారని, తద్వారా కొందరు లిక్కర్ తయారీదారులు, హోల్‌సైల్, రిటైలర్లు లాభపడ్డారని ఈడీ ఆరోపణగా ఉంది. ఈ కేసులో ఆప్ సీనియర్ నేత, దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా సైతం ఫిబ్రవరి నుంచి జైలులో ఉన్నారు. కాగా, తమ బాస్ అరవింద్ కేజ్రీవాల్‌పై కుట్ర జరుగుతోందని సంజయ్ సింగ్ సంచలన ఆరోపణ చేశారు. కేవలం అరెస్టు చేయడమే కాదు, కేజ్రీవాల్‌పై పెద్ద ప్లానే ఉందని కేంద్రంపై ఆయన పరోక్షంగా ఆరోపణలు చేశారు. ఎక్సైజ్ పాలసీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు ముందు హాజరుపరిచిన అనంతరం సంజయ్‌సింగ్ మీడియా ముందు ఈ సంచలన ఆరోపణలు చేశారు.

ఇండో-పసిఫిక్ రక్షణకు కట్టుబడదాం

- రక్షణ సహకారాన్ని - వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకుందాం
- 2+2 చర్చల్లో భారత్, అమెరికా మంత్రులు

న్యూదిల్లీ: ఇండో-పసిఫిక్ రక్షణకు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని, రక్షణ రంగంలో సహకరాన్ని పెంచుకుందామని భారత్, అమెరికా దేశాలు సంకల్పించాయి. బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను తయారు చేసుకునేందుకు ఉమ్మడి ప్రణాళికలపైనా ఐదవ 2+2 మంత్రుల స్థాయి సమావేశంలో రెండు దేశాల మంత్రులు చర్చించారు. సమావేశంలో భారత్, అమెరికా రక్షణ, విదేశాంగ శాఖ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ఎస్ జైశంకర్, లాయిడ్ ఆస్టిన్, ఆంటోని బ్లింకెన్ పాల్గొన్నారు. రక్షణ పరిశ్రమలో భాగస్వామ్యం, ఉగ్రవాదంపై చర్యలు, సెమీ కండెక్టర్లు, ఖనిజాల రంగాల్లో కటింగ్ ఎడ్జ్ సాంకేతికతలు, ఇండో పసిఫిక్, పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లోని పరిస్థితులపైనా చర్చలు జరిపారు. అంతరిక్షం నుంచి సముద్ర గర్భం వరకు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. జైశంకర్ సమావేశాన్ని ప్రారంభిస్తూ 'ఇద్దరు దేశాధినేతల విజన్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు, అంతర్జాతీయ అజెండాను నిర్మాణాత్మకంగా పంచుకునేందుకు 2+2 చర్చలు దోహదమవుతాయని అన్నారు. వ్యూహాత్మక భాగస్వామం క్రమంగా పెరిగినట్లు తెలిపారు. ఆంటోనీ బ్లింకెన్ మాట్లాడుతూ 'రెండు దేశాల మధ్య బంధం ఎన్నడూ లేనంత బలంగా ఉంది. ఈ సంవత్సరం భారత నాయకత్వ పటిమ జీ20 నిర్వహణతో రుజువైంది. భారత్‌తో కలిసి ఇండో-పసిఫిక్ ప్రాంత భవిష్యత్తు కోసం పనిచేస్తాం' అని తెలిపారు. జీ20 నిర్వహణకు సహకరించిన అమెరికాకు జైశంకర్ ధన్యవాదాలు తెలిపారు. కాగా, సన్నిహిత సంబంధాలున్న దేశాల మధ్య రక్షణ, భద్రతాంశాలపై పురోగతిని సమీక్షించేందుకు 2+2 చర్చలు నిర్వహిస్తారు.

బాణసంచా విక్రయాలపై నిఘా

- మందుగుండు సామాగ్రి తయారీ, గోడౌన్ల తనిఖీ
- దీపావళి ప్రశాంతంగా జరగాలి : కమిషనర్లు, ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దీపావళి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలకు డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గతంలో దీపావళి సందర్భంగా జరిగిన ఘటనల దృష్ట్యా బాణసంచా తయారీ/విక్రయ కేంద్రాల నిర్వాహకులతో సమావేశమై తగు మార్గదర్శకాలు చేయాలని సూచించారు. అనుమతి లేకుండా టపాసులను ఇళ్లల్లో, షాపులలో, జన సముదాయాల మధ్య గోడౌన్‌లలో నిల్వలు చేసినా, లైసెన్సు లేకుండా విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులు సూచించిన నియమ నిబంధనలను బాణాసంచా దూకణదారులు తప్పనిసరిగా పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడైనా అక్రమంగా మందుగుండు సామాగ్రి తయారు చేసినా, విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం తెలిసినా 100/112 నంబర్లకుగానీ, స్థానిక పోలీసులకుగానీ సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు మందుగుండు సామాగ్రి నిల్వకు 239 లైసెన్సులు జారీ చేసినట్లు తెలిపారు. బాణాసంచా విక్రయాలకు 3,856 షాపులకు లైసెన్సు మంజూరు చేశామని వెల్లడించారు. లైసెన్సులు పొంది నిబంధనలు అతిక్రమించిన వారిపై కాకినాడలో రెండు, నంద్యాలలో ఒకటి చొప్పున మొత్తం మూడు కేసులు నమోదు చేశామన్నారు. అక్రమ నిల్వలు, తయారీ, విక్రయాలకు సంబంధించి రాష్ట్రంలోని 44 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 60 కేసులు పెట్టామన్నారు. గత ఘటనల్లో ప్రమేయం ఉన్న 1,223 మందిని బైండోవర్ చేయడంతో పాటు 429 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. రాష్ట్రంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.42,36,400 విలువైన మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలు

- బాణాసంచా నిల్వచేసే కేంద్రాల నిర్వాహకులు, తయారీ చేసేవారు, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలి.
- బాణసంచా సామాగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు ప్రజల నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలి.
- ఫైర్ సేఫ్టీ తప్పనిసరిగా పాటించాలి.
- అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.
- దుకాణాలను జనావాసాలకు, విద్యాసంస్థలకు, ఆసుపత్రులకు దూరంగా అధికారులు సూచించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలి.
- దుకాణాల మధ్య నిర్దిష్ట దూరం ఉండాలి.
- ప్రతీ దుకాణం వద్ద అగ్ని నిరోధక సిలెండర్లు, తగినంత పొడి ఇసుక, కావాల్సిన నీరు అందుబాటులో ఉండాలి.
- బాణసంచా నిల్వ/ తయారీ/ విక్రయ కేంద్రాల్లో పనిచేసే వారిలో మైనర్లు ఉండరాదు.
- లైసెన్స్ ఉన్న విక్రయిదారులు లైసెన్స్ లేని వారికి విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవించినా, దానికి లైసెన్స్ దారులదే పూర్తి బాధ్యత వహించాలి.
- లైసెన్స్ కలిగిన విక్రయాదారులు తమ లైసెన్స్‌ను దుకాణం వద్ద అందరికీ కనిపించేలా ఉంచాలి.
- అనుమతి పొందిన దుకాణదారులు అధికారులు సూచించిన సమయాల్లో మాత్రమే విక్రయాలు జరపాలి. దీపావళి రోజున సాయింత్రం 5 గంటల తరువాత ఎటువంటి అమ్మకాలు జరపరాదు.

యడియూరప్ప తనయుడికి బీజేపీ పగ్గాలు

బెంగళూరు: కర్నాటక బీజేపీకి కొత్త అధ్యక్షుడిని ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ప్రకటించింది. పార్టీ దిగ్గజ నేత, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప తనయుడు విజయేంద్రను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించింది. ఈ నియామకం తక్షణం అమల్లోకి వచ్చినట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తెలిపారు. నళిన్‌కుమార్ కటీల్ స్థానంలో విజయేంద్ర కొత్త అధ్యక్షుడి పదవిలో నియమితులయ్యారు. ఈ ఏడాది ప్రథమార్థంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయేంద్ర గెలుపొందారు. 47 ఏళ్ల విజయేంద్ర తన తండ్రి యడియూరప్ప రాజకీయవారసుడిగా ఉన్నారు. మేలో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం చవిచూడటంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చనున్నారంటూ కొద్దికాలంలో ఊహాగానాలు వినిపిస్తూ వచ్చాయి. కాగా, యడియూరప్ప పెద్ద కుమారుడు బీవై రాఘవేంద్ర ఎంపీగా ఉన్నారు.

మునిరత్నంపై వైసీపీ దాడిని ఖండిస్తున్నా: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని చంద్రగిరి మండలం, భీమవరం గ్రామ టీడీపీ నేత మునిరత్నం నాయుడుపై వైసీపీ గూండాల దాడిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. మద్యం, గంజాయి మత్తులో చెవిరెడ్డి అనుచరులు, కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నవీన్ రెడ్డి తన అనుచరులతో దాడికి పాల్పడ్డారన్నారు. తమ అనుచరులను అదుపులో పెట్టుకోవాలని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డిని హెచ్చరించారు. ఓటమి అంచున వైసీపీ వేలాడుతున్నందునే దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి గాల్లో తిరుగుతూ శాంతిభద్రతలను గాలికొదిలేశారని విమర్శించారు. ఎన్ని దాడులు, బెదిరింపులకు దిగినా టీడీపీ వెనకడుగు వేయదని గుర్తుంచుకోవాలని అన్నారు. తిరుపతి పరిసరాల్లో అలజడి సృష్టిస్తున్నారని, మునిరత్నంపై దాడిచేసి నగదు, బంగారాన్ని లాక్కెళ్లి బందిపోటు ముఠాను తలపించారన్నారు. దాడి చేసిన వారిపై ఎస్పీ పరమేశ్వరరెడ్డి చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. మునిరత్నం కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అభిమాన నటుడు కృష్ణ : కమల్‌హాసన్

విశాలాంధ్ర-విజయవాడ: టాలీవుడ్ సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ శుక్రవారం ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీవో పార్కులో ఏర్పాటు చేసిన నటశేఖరుడి విగ్రహాన్ని అభిమానుల సమక్షంలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పాల్గొన్నారు. ప్రిన్స్ మహేశ్ బాబు- కృష్ణ అభిమానుల ఆహ్వానం మేరకు కమల్‌హాసన్ హాజరయ్యారు. ఇండియన్-2 చిత్రం షూటింగ్ కోసం కమల్‌హాసన్ రెండు రోజుల క్రితం విజయవాడ వచ్చారు. సూపర్‌స్టార్ విగ్రహాన్ని ఆవిష్కరించడంపై కమల్ ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలందరి అభిమాన నటుడు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని దేవినేని అవినాశ్ అన్నారు. ఆయన నట వారసుడిగా సినీ పరిశ్రమలోకి వచ్చిన మహేశ్‌బాబు సినీ రంగంతో పాటు అనేక సేవా కార్యక్రమాల్లో ముందున్నారని కొనియాడారు. కృష్ణ గౌరవాన్ని మహేశ్ నిలబెడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమల్ హాసన్ పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నగర ప్రజల తరపునే కాకుండా సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్ బాబు అభిమానుల తరపున కమల్‌హాసన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదిరోజుల వ్యవధిలోనే కృష్ణ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృష్ణ కుటుంబ సభ్యుల తరపున దేవినేని అవినాశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కృష్ణ, మహేశ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధం మానవ హక్కుల ఉల్లంఘనే

నెల్లూరు పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నిందితుల పేరుతో అక్రమంగా నిర్బంధించడం మానవ హక్కుల ఉల్లంఘనేనని నెల్లూరు పోలీసు అధికారులపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వేదాయపాలెంలో చీటింగ్‌కేసుకు సంబంధించి వల్లపల్లి విజయకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్టోబరు 25న తీసుకెళ్లి నవంబరు 8న మధ్యాహ్నం కేసు నమోదు చేశారని విజయ్ భార్య హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్న ఫొటోను కోర్టుకు సమర్పించారు. భర్త ఆచూకీ చెప్పాలని రోజుల తరబడి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. చీటింగ్ కేసులో అదుపులోకి తీసుకున్న వ్యక్తిని రోజుల తరబడి అక్రమ నిర్బంధంలో ఎందుకు ఉంచాల్సి వచ్చిందని ధర్మాసనం ప్రశ్నించింది. భార్య, పిల్లలు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసులపై చర్యలు, పరిహారం ఇప్పించేందుకు తగిన ఫోరాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు హైకోర్టు వెసులుబాటు కల్పించింది.

రాజేశ్‌కి ఎల్వోసీ పొరపాటే

హైకోర్టుకు తెలిపిన సీఐడీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కిలారు రాజేశ్‌కి పొరపాటున ఎల్‌వోసీ ఇచ్చామని సీఐడీ తన తప్పును అంగీకరించింది. ఈ కేసు విషయంలో కిలారు రాజేశ్ తనకు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 161, 91 సెక్షన్‌ల కింద నోటీసులు ఇవ్వడాన్ని కిలారు రాజేశ్ హైకోర్టులో సవాల్ చేశారు. రాజేశ్ తరపున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. ఎల్‌ఓసీ నోటీసుల్లో రాజేశ్‌ను నిందితుడిగా చూపించిన విషయాన్ని ఆదినారాయణరావు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మళ్లీ 161, 91 కింద నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ వాదనలు వినిపించారు. తాము ఎల్‌ఓసీ పొరపాటున ఇచ్చామని సీఐడీ తరపు న్యాయవాది చెప్పారు. హైదరాబాద్‌లో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు రాజేశ్‌ను వెంబడించిన విషయాన్ని కోర్టు దృష్టికి న్యాయవాది తీసుకువచ్చారు. అయితే తాము రాజేశ్‌ను నిందితుడిగా పేర్కొనలేదని సీఐడీ న్యాయవాది చెప్పారు. పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని సీఐడీ న్యాయవాదులు కోరారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 17కు వాయిదా వేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.